


బీసీల్లో పెరుగుతున్న ఆశలు.. అంచనాలు

● ప్రధాన పార్టీల టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు



తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై బీసీల్లో ఆశలు, అంచనాలు పెరుగుతున్నాయి. పలు స్థానాల్లో ఇటు వైసీపీ నుంచీ అటు టీడీపీ నుంచీ అసెంబ్లీ టికెట్ల కోసం బీసీ సామాజికవర్గాలకు చెందిన పలువురు ఆశావహులు రేసులో వున్నారు. హోరాహోరీగా తలపడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు మెజారిటీ ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటాపోటీగా బీసీలకు అవకాశం కల్పించేందుకు యత్నిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పార్టీలు అనుసరిస్తున్న ధోరణిని గమనిస్తున్న ఆశావహులు తాజా పరిణామాలు తమకు మేలు చేస్తాయని భావిస్తున్నారు. దీంతో పలువురు టికెట్ రేసులో గట్టిగా నిలిచి తమ అదృష్టాలను పరీక్షించుకుంటున్నారు. తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 17 స్థానాలకు గానూ తంబళ్ళపల్లి, పలమనేరు, కుప్పం, చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం బీసీల నుంచీ డిమాండ్ వుండగా టీడీపీ తొలి అభ్యర్థుల జాబితాలో తంబళ్ళపల్లి టికెట్ ఇతరులకు కేటాయించడంతో అక్కడ అవకాశం లేకుండా పోయింది. మిగిలిన చోట్ల ఎందరు టికెట్ సాధిస్తారో, టికెట్ సాధించిన వారిలో ఎందరు గెలుపు సాధిస్తారో తెలియదు గానీ ఆయా నియోజకవర్గాల నుంచీ ఆయా పార్టీల అధిష్ఠానాలకు బీసీ సామాజికవర్గాల తరపున తమ గళాన్ని మాత్రం బలంగా విన్పించడంలో సఫలమవుతున్నారు.

తిరుపతి,
ఆంధ్రజ్యోతి

కుప్పంలో భరత్ పోటీ ఖాయమే!

కుప్పం నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎమ్మెల్సీ భరత్ పోటీ చేయడం ఖాయమనే చెప్పాలి. ఆయనకు టికెట్ ప్రకటన లాంఛనప్రాయమే. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో వన్యకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ప్రజలున్నారు. అదే వర్గానికి చెందిన భరత్ తండ్రి చంద్రమౌళికి వైసీపీ 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు టికెట్ కేటాయించింది. గత ఎన్నికల తర్వాత అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు భరత్‌ను నియోజకవర్గ ఇంచార్జిగా ప్రకటించి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది వైసీపీ. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారాయన. వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నందున ఆ వర్గాలతో పాటు ఇతర బీసీల ఓట్ల కోసమే వైసీపీ భరత్‌కు టికెట్ ఇవ్వనుంది. అయితే టీడీపీకి, వ్యక్తిగతంగా చంద్రబాబుకు కంచుకోట వంటి కుప్పంలో ఆయన ముందు ఏ సమీకరణలూ పనిచేసే పరిస్థితి లేదనే చెప్పాలి.

తిరుపతి రేసులో నరసింహ యాదవ్

తిరుపతిలో అధికంగా వున్న బీసీ కులాలు సాంప్రదాయకంగా టీడీపీ వెన్నంటి వున్నప్పటికీ పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ బీసీలకు ఇక్కడ అవకాశం దక్కలేదు. ఇదే నినాదంతో తుడా మాజీ ఛైర్మన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ఈసారైనా బీసీ కోటా కింద తనకు టికెట్ ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని అన్ని బీసీ కులాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు ఇటీవల ఒకటి రెండు పర్యాయాలు ఆత్మీయ సమావేశాలు కూడా నిర్వహించి పార్టీ టికెట్ డిమాండ్ చేశారు. అయితే వీరి డిమాండ్ పార్టీ అధిష్ఠానానికి చేరాల్సినంత బలంగా చేరడం లేదు. దీంతో బీసీల టికెట్ డిమాండ్ తిరుపతి వరకే పరిమితమవుతోంది తప్ప అధిష్ఠానానికి చేరడం లేదు.

పలమనేరు టికెట్ కోసం ఇద్దరి పోటీ

పలమనేరు నియోజకవర్గం తొలుత ఎస్సీ రిజర్వుడు సెగ్మెంట్. పునర్విభజనతో 2009 నుంచీ జనరల్ స్థానంగా మారింది. తొలి ఎన్నికల్లో టీడీపీ తరపున, 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున అమరనాథరెడ్డి గెలిచారు. అయితే తగిన గుర్తింపు లేని కారణంగా వైసీపీని వీడి టీడీపీలో చేరి మంత్రి కూడా అయ్యారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు.ఆ ఎన్నికల్లో వైసీపీ బీసీ సామాజికవర్గంలో వక్కళిగ కులానికి చెందిన వెంకటే గౌడకు టికెట్ ఇవ్వగా ఆయన సంచలన విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లో కూడా తనకే టికెట్ దక్కుతుందని ఆయన ధీమాగా వున్నప్పటికీ పోటీ మాత్రం తప్పడం లేదు. వక్కళిగ కులానికే చెందిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కూడా టికెట్ రేసులో వున్నారు. వైసీపీలో ఇద్దరూ బీసీలే టికెట్ కోసం పోటీ పడుతున్నారు. అవకాశం ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సి వుంది. గత ఎన్నికల్లో వైసీపీ మీద సానుభూతి పవనాలు వీచడంతో సులువుగా గెలిచినప్పటికీ రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని ఢీకొనడం ఈ ఇద్దరిలో ఎవరికైనా అంత సులువైతే కాదు.

పుంగనూరులో రామచంద్ర యాదవ్ ఒంటరిపోరు

పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేయడం ఖాయం. అలాగే టీడీపీ టికెట్ చల్లా రామచంద్రారెడ్డికీ ఖాయమైంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప టీడీపీ అభ్యర్థి మారే అవకాశం లేదు. ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచీ పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించి జనం దృష్టిని ఆకర్షించిన రామచంద్ర యాదవ్ వ్యక్తిగతంగానే మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడి జనంలో క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఆయన జనసేన లేదా టీడీపీ అదీ కాకుంటే కనీసం బీజేపీలో చేరివున్నా ఉమ్మడి అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో బలంగా ప్రభావం చూపేవారు. అలా కాకుండా సొంతంగా రాజకీయ పార్టీ పెట్టడంతో ఆయన ప్రభావం తగ్గిందనే చెప్పాలి. రానున్న ఎన్నికల్లో అసలు ఆయన పుంగనూరు నుంచీ పోటీ చేస్తారో లేదో కూడా తెలియడం లేదు. అయితే ఇంత కాలం మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడిన కారణంగా వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తారని పుంగనూరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా వున్న బీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారి అంచనాలు ఏమవుతాయో వేచి చూడాల్సివుంది.

చంద్రగిరిలో బడి సుధా యాదవ్

చంద్రగిరికి సంబంధించి బీసీ నేత బడి సుధా యాదవ్ టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. తొలుత కాంగ్రెస్‌లో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అనుచరుడిగా వున్న ఇతడు 2014లో ఆమె వెంట టీడీపీలో చేరారు. అరుణకుమారి రాజకీయాల నుంచీ తప్పుకోవడంతో చంద్రగిరి పగ్గాలు పులివర్తి నానీ చేతికి వచ్చాయి. స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన కారణంగా పులివర్తి నానీతో ఇమడలేక 2019 ఎన్నికల తర్వాత వైసీపీలో చేరారు. పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో వ్యతిరేకించి తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచుగా గెలిచారు. అప్పటి నుంచీ వైసీపీకి దూరంగా వున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం గల్లా అరుణకుమారి కుటుంబం ద్వారా యత్నించారు. అయితే అప్పటికే పులివర్తి నానీ నియోజకవర్గంలో పాతుకుపోయి వుండడం, ఆయనను గెలిపించాలని సాక్షాత్తూ టీడీపీ యువనేత నారా లోకేశ్ చంద్రగిరి ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడ టికెట్ నానీకి తప్ప ఇతరులకు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో జనసేన తరపున చంద్రగిరి లేదా తిరుపతి నుంచీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కోసం యత్నిస్తున్నట్టు సమాచారం. అవకాశాల సంగతెలా వున్నా చంద్రగిరి నియోజకవర్గంలో బీసీ స్వరం వినిపించిన తొలి నాయకుడిగా సుధా యాదవ్ గుర్తింపు దక్కించుకున్నారు.

వెంకటగిరి టికెట్ కోసం మస్తాన్ యత్నాలు

వెంకటగిరి నియోజకవర్గంలో ఇంచార్జిగా కమ్మ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వున్నారు. రామకృష్ణతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా వెంకటగిరి టీడీపీ టికెట్ రేసులో వున్నారు. వీరి సంగతి పక్కన పెడితే ఈ నియోజకవర్గం నుంచీ ఈ పర్యాయం బీసీ వర్గాల నుంచీ మస్తాన్ యాదవ్ రేసులో నిలిచారు. పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఈయన వారి ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెప్పిస్తున్నట్టు సమాచారం. అవకాశమిస్తే ఎన్నికల్లో ఎంత ఖర్చయినా భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు తనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు పలువురు ప్రముఖులు సిద్ధంగా వున్నారని అధినేతకు నివేదించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాదు కేంద్రంగా ఆయన టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు బలమైన ఆశావహుల నడుమ మస్తాన్ యాదవ్ చేస్తున్న ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో తెలియదు కానీ నియోజకవర్గం నుంచీ టికెట్ కోసం బీసీ గళాన్ని మాత్రం ఆయన గట్టిగానే వినిపిస్తున్నారు.

తంబళ్ళపల్లిలో శంకర్ స్వయంకృతాపరాధం

2014లో టీడీపీ ఇచ్చిన అవకాశంతో గుళ్ళోళ్ళ శంకర్ యాదవ్ తంబళ్ళపల్లె నియోజకవర్గ తొలి బీసీ ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారు. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ అవకాశమిచ్చినా ఓడిపోయారు. రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు గట్టిగా యత్నించారు. బీసీ కోటాలో ఆయనకు తప్పనిసరిగా మూడవ పర్యాయం కూడా అవకాశం దక్కుతుందని బీసీ వర్గాలు ఆశపెట్టుకున్నాయి. అయితే ఈసారి టికెట్ రెడ్డి సామాజికవర్గానికి చెందిన జయచంద్రారెడ్డికి కేటాయించారు. దీనికి శంకర్ యాదవే కారణమని, చేజేతులారా ఈ పరిస్థితిని కొని తెచ్చుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వుండడంతో అడపాదడపా మాత్రమే శంకర్ నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. దీనిపై శ్రేణుల్లో అసంతృప్తిని పసిగట్టిన అధిష్ఠానం పలుమార్లు ఆయన్ను తీరు మార్చుకోవాలని, ఎక్కువ సమయం జనం మధ్యే గడపాలని హెచ్చరించింది. ఆరు నెలలు గడువు కూడా ఇచ్చింది. అయినా ఆయన తీరు మారలేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో అధిష్ఠానం ప్రత్యామ్నాయం వైపు ఆలోచించి నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు సార్లు అవకాశమిచ్చిన టీడీపీ అధిష్ఠానం బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిందని, అయితే దాన్ని నిలుపుకోకుండా శంకర్ నియోజకవర్గానికి దూరమైనందువల్లే బీసీలకు అవకాశం లేకుండా పోయిందని బీసీ వర్గాలు ఆయనపై గుర్రుగా వున్నట్టు సమాచారం.



చంద్రగిరి రాజకీయాలపై ప్రభావం!



● ఒంగోలు ఎంపీ వైసీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

● సొంత నియోజకవర్గంపై తాజా నియామక ప్రభావమెంత!

తిరుపతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి నియమితులయ్యారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి అధికార పార్టీ తరపున ఎంపీగా పోటీచేయడం దాదాపు ఖరారైనట్టయింది. ఈ నియామకం చంద్రగిరి నియోజకవర్గ రాజకీయాలపై ప్రభావం చూపనుంది. భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నుంచీ రాజకీయంగా ఒంగోలుకు వలస వెళ్ళాల్సి రావడం అధికార పార్టీ శ్రేణులకు నిస్పృహ కలిగిస్తుండగా ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ శ్రేణుల్లో మరింత ధీమా పెంచుతోంది. చంద్రగిరి రాజకీయాల్లో చెవిరెడ్డి తనదైన ముద్ర వేశారు.పదేళ్ళుగా ఆయన వైసీపీ శ్రేణులను సర్వం తానై నడిపించారు. పెళ్ళిళ్ళు, చావులు, అనారోగ్యాలు... ఇలా సందర్భం ఏదైనా స్వయంగా ఆయా ఇళ్ళకు వెళ్ళి సంబంధిత కుటుంబీకులను కలుస్తూ వ్యక్తిగత పరిచయాలు, సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం చేశారు. ఇక ఉత్సవాలు, జాతర్లకు ఎంత మారుమూల కుగ్రామానికైనా, ఆలయానికైనా తనే వెళ్ళి పాల్గొనే వారు. ఆయా వేడుకల నిర్వహణకు ఆర్థికంగానూ సాయం అందించే వారు. ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణతో యువతను ఆకట్టుకునేందుకు యత్నించారు. పండుగలకు, పబ్బాలకు కానుకల పంపిణీ, వినాయక చవితికి విగ్రహాల పంపిణీ...ఇలా తాయిలాలకూ పేరు మోశారు. కుటుంబ సభ్యులు ముగ్గురూ ఎంతగా చంద్రగిరి రాజకీయాల్లో మమేకమైనా నియోజకవర్గంలో మొత్తం వైసీపీ రాజకీయమంతా భాస్కర రెడ్డి కేంద్రంగానే నడుస్తోంది. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిని చంద్రగిరి వైసీపీ ఇంచార్జిగా, రానున్న ఎన్నికలకు అభ్యర్థిగా ప్రకటించినా, తుడా ఛైర్మన్‌గా నియమించినా కూడా నేటికీ భాస్కరరెడ్డి ఛత్రఛాయలోనే మోహిత్ సైతం నడుస్తున్న పరిస్థితి. ఆయనకున్న విస్తృత పరిచయాలు, రాజకీయ వ్యూహాలూ నిస్సందేహంగా కుటుంబీకులకు లేవు. భాస్కరరెడ్డి ప్రత్యక్షంగా లేకుండా చంద్రగిరి ఎన్నికల సమరానికి వైసీపీ గానీ, ఆయన తనయుడు మోహిత్‌గానీ పూర్తిస్థాయిలో సంసిద్ధమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. భాస్కరరెడ్డి ఒంగోలులో పోటీ చేస్తే వనరులు, సొంత మనుషులు ఏదో ఒక స్థాయిలో చంద్రగిరి నుంచీ ఒంగోలుకు తరలక తప్పదు. అది చంద్రగిరిలో మోహిత్‌కు కష్టం, నష్టం కలిగించే అవకాశం వుంటుంది. భాస్కరరెడ్డి రాజకీయ వ్యూహాలు, కార్యాచరణ గురించి స్పష్టంగా తెలిసిన టీడీపీ శ్రేణులు, నేతలు తాజా పరిణామంతో ఊరట పొందుతున్నారని చెప్పాలి. వైసీపీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వుందని, టీడీపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, చంద్రగిరిలో టీడీపీ గెలుపు ఖాయమని ఇప్పటికే బలంగా విశ్వసిస్తున్న స్థానిక టీడీపీ శ్రేణులకు వైసీపీ తాజా నియామకం మరింత ధీమాను పెంచింది. అధినేత జగన్‌కు అందుబాటులో వుండేందుకు భాస్కరరెడ్డి చంద్రగిరి బరి నుంచీ తప్పుకుని తాడేపల్లి చేరుకున్నప్పుడే టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. తాజా నియామకంతో భాస్కరరెడ్డి ఎన్నికల్లో చంద్రగిరిలో ప్రత్యక్షంగా వుండలేని పరిస్థితి నెలకొంది. దానివల్ల పోల్ మేనేజ్‌మెంట్‌లో చంద్రగిరి వైసీపీ మునుపటి స్థాయిలో పనిచేసే పరిస్థితి లేదని టీడీపీ శ్రేణుల భావన. వైసీపీలో ఆ లోటు తమకు లాభిస్తుందనే అంచనాతో టీడీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి భాస్కర రెడ్డికి తాజా నియామకం రాజకీయంగా పదోన్నతి అని చెప్పాలి. అయితే అది అక్కడ ఎంపీగా గెలిస్తే. ఆయన రాజకీయ పదోన్నతి సంగతి ఎలా వున్నా సొంత నియోజకవర్గంలో కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోణంలో చూస్తే మాత్రం తాజా నియామకం ఆయన కుటుంబానికి ఎంతోకొంత కష్టాన్ని, నష్టాన్ని కలిగిస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల నుంచీ వినిపిస్తోంది.

ఎన్నికల తాయిలాలు

ముక్కంటి ఆలయ ట్రస్ట్ బోర్డు తాజా నిర్ణయాలు

గడువు ముగింపునకు ఒకరోజు ముందు సమావేశం

ఉద్యోగులకు ఇంటి స్థలాలు..ఇంజనీరింగు పనులకు పెద్దఎత్తున నిధులు



ముక్కంటి ఆలయ ట్రస్ట్ బోర్డు సమావేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 : గడువు ముగుస్తున్న తరుణంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి పలు కీలక అంశాలకు ఏకపక్షంగా ఆమోదం తెలిపేసింది.నిజానికి నేటితో మండలి రెండేళ్ల కాలపరిమితి ముగియనుంది. పొడిగింపు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు కానీ రాదేమోనన్న అనుమానంతో బుధవారం సమావేశం పెట్టుకున్నారు. ఆలయ నిధులు పెద్దఎత్తున ఖర్చుపెట్టేందుకు పలు తీర్మానాలను ఆమోదించారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేవస్థాన ఉద్యోగులకు స్థానికంగా ఇంటి స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.పరిపాలనా భవనంలో పని చేసే 10మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు,ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఆరుగురిని కాంట్రాక్టు విధానంలో నియమించే ప్రతిపాదనలను దేవదాయశాఖకు ఫైల్ పంపించేలా నిర్ణయించారు. మొత్తం 33 అంశాలను అజెండాలో చేర్చి ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు.అయితే దేవస్థానం నిధులు ఏయే పనులకు ఎంత కేటాయించారో మాత్రం బయటకు పొక్కనీయలేదు. అజెండాలోని 33 అంశాల్లో ఎక్కువ భాగం ఇంజనీరింగ్ విభాగంలో పనులకు సంబంధించే వుండడం కొసమెరుపు.

అజెండాలో ఇంకా ఏమున్నాయంటే...

ముక్కంటి ఆలయ ప్రాంగణంలో అసలే ఇరుగ్గా ఉన్న సుపథ మండపం, వసంత మండపం వద్ద గోమాతలకు పూజలు చేసే సప్తగోకులం ఏర్పాటుకు, ఈటీసీ సెంటర్ వద్ద కాశీ విశ్వనాథ స్వామి ఆలయం పక్కన ఖాళీ స్థలంలో కల్యాణ మండపం ఏర్పాటుకు, రూ.50 దర్శనం, ఉచిత క్యూలైన్లలో టీవీల కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారు. కుమారస్వామి తిప్ప వద్ద వినాయక ఆలయంతో పాటు మండప నిర్మాణం, దుర్గమ్మ కొండ కింద మెట్ల నుంచి విద్యుత్ లైన్, లైట్ల ఏర్పాటుకు, భరద్వాజ తీర్థంలోని బిల్వవనం విస్తరణకు పనులు చేపట్టాలని నిర్ణయించారు. స్వర్ణముఖి నదిపై రెండు వంతెనలకున్న విద్యుత్ స్తంభాలకు లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం, ముత్యాలమ్మ గుడి పక్కన వెలగాలమ్మకు కొత్తగా ఆలయం, విగ్రహం ఏర్పాటు, దేవస్థానంలో హోమాలకు పంచలోహాలను కొనుగోలు చేయడం, గోపురం సంస్థ ద్వారా 108 హోమ ద్రవ్యాలను కొనుగోలు చేయడం, రాఘవేంద్ర స్వామి మఠం నుంచి ప్రస్తుతం ఉన్న స్నానఘట్టాల వరకు కొత్తగా మెట్లను నిర్మించడం, అగస్తీశ్వరాలయంలో మరుగుదొడ్లు, రథోత్సవం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ లైటింగ్, ఏడుగంగమ్మల, ముత్యాలమ్మ ఆలయానికి ఆర్చి నిర్మాణం,రాజగోపురం వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి కుమారస్వామి తిప్ప, గంగమ్మ గుడి, బూడిదమిట్ట ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించడం, టైలర్స్ కాలనీ వద్ద వినాయక స్వామి ఆలయ నిర్మాణం తదితర ఇంజనీరింగు పనులకు ఆమోదం తెలిపారు.

లంచమడిగిన పోలీసు సస్పెన్షన్

భాకరాపేట, ఫిబ్రవరి 28 : భాకరాపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటరమణ అలియాస్ వెంకీపై అవినీతి ఆరోపణలు రావడంతో ఎస్పీ మలిక గర్గ్ సస్పెండ్ చేశారు. రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లుకు చెందిన సురేష్‌కు, చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లెకు చెందిన శిల్పతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది.ఇద్దరూ బెంగళూరులో ఉద్యోగం చేసేవారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.కొవిడ్ సమయంలో పెద్దగొట్టిగల్లుకు వచ్చేశారు.నాలుగు నెలల క్రితం భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో శిల్ప పుట్టింటికి చేరింది.సంక్రాంతి సమయంలో సురేష్ తల్లి కోడలి వద్దకు వచ్చి మనవడిని ఇంటికి పంపమని అడిగింది.ఈ విషయమై అత్తాకోడళ్ళ మధ్య వాగ్వాదం జరగడంతో సురేష్ తన తల్లితో కలిసి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేయమని ఆదేశించినా కానిస్టేబుల్ వెంకటరమణ అలస్యం చేశాడు. సురేష్‌కు అనుకూలంగా కేసు నమోదు చేస్తానని చెప్పి డబ్బు తీసుకున్నాడు. మరి కొంత డబ్బులివ్వాలని ఫోన్లో అడగ్గా సురేష్ వాయిస్ రికార్డు చేసి ఎస్పీకి పంపించి ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్పీ విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడినట్లు తేలడంతో కానిస్టేబుల్ వెంకటరమణను సస్పెండ్ చేశారు.పదేళ్లుగా ఎర్రావారిపాలెం, భాకరాపేట స్టేషన్లలోనే వెంకటరమణ పనిచేస్తుండడం గమనార్హం.



→ కానిస్టేబుల్ వెంకటరమణ

ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే వారికే

ఎన్నికల్లో మద్దతు

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

● దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి మార్చి 9 న ఛలో విజయవాడ



సభలో ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 28: ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీకి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తిరుపతిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలపై మార్చి 9 వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం జగన్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 1990 లో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు వర్గీకరణకు న్యాయం చేశారని చెప్పారు. దీని ఫలితంగా 22 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రధాని మోదీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇందువల్ల ప్రధాని మోదీకి, బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్, జాతీయ నాయకులు నరేంద్రబాబు, నాయకులు రాజేంద్ర, పెంచలయ్య, రాధాకృష్ణ, గోపీ, ప్రకాష్, రవీంద్ర, రామకృష్ణ, వాసు, చిన్న, మురళి, దేవరాజ్, నరసింహ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడని టికెట్ అడిగితే

అవమానిస్తున్నారు

● చనిపోతానంటూ వైసీపీ దళిత నేత డేవిడ్ వీడియో


పురుగుమందు డబ్బాతో డేవిడ్

కేవీబీపురం, ఫిబ్రవరి 28 : సత్యవేడు వైసీపీ టికెట్ ఆశించిన కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ మనస్తాపం చెందారు.టికెట్ అడిగినందుకు తనను అయినవారే ఎగతాళి చేస్తున్నారంటూ బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.సత్యవేడు టికెట్ ప్రతిసారీ బయటివారికి కేటాయించి స్థానికులను నిరాశపరుస్తున్నారనేది డేవిడ్ వాదన. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని,ఎంపీ మిధున్ రెడ్డిని కలిసిన డేవిడ్ స్థానికుడిగా తనకు సత్యవేడులో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు.ఈ విషయం తెలిసి స్థానికంగా కొంతమంది నాయకులు నీ స్థాయికి ఎమ్మెల్యే టికెట్ కావాలా అంటూ తనను అవహేళన చేస్తూ మాట్లాడుతుండడంతో మనస్తాపం చెంది తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయన ఇంటి వద్దకెళ్ళి పరిశీలించారు. అయినా డేవిడ్ ఆచూకీ దొరకలేదు.పోలీసులు ఫోను లోకేషన్‌ను ట్రేస్ చేయడానికి ప్రయత్నించగా అది స్విచ్ఆఫ్‌లో ఉంది.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వంశీకృష్ణ



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 28 : బీజేపీ యువజన విభాగం (బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తిరుపతికి చెందిన మెట్ట వంశీకృష్ణ నియమితులయ్యారు. ఆ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ బీజేవైఎంను బలోపేతం చేసేందుకు శాయశక్తులా పనిచేస్తానని చెప్పారు. కాగా వంశీకృష్ణ విద్యార్థి దశనుంచే బీజేపీలో పనిచేస్తున్నారు. యువమోర్చా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులుగా పనిచేశారు. ఇప్పుడు యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియామకం కావడం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సాహిత్యం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఉద్యమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28: సాహిత్యం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి దోహదం చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం పేర్కొన్నారు. పద్మావతీ యూనివర్సిటీ తెలుగు విభాగంలో బుధవారం నిర్వహించిన కేతకలతూరి కృష్ణయ్య స్మారకోపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు నవలా సాహిత్యం ఎక్కువగా పర్యావరణ అంశాలను ప్రతిబింబించిందన్నారు. పర్యావరణ విధ్వంసంతో మానవ మనుగడకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. వీసీ భారతి మాట్లాడుతూ తెలుగు విభాగం నిరంతరం కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీన్ అనురాధ మాట్లాడుతూ పర్యావరణంపై ఈ కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామమన్నారు. కవయిత్రి కొండపల్లి నిహారిణి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. పద్మావతి కాలేజీ అధ్యాపకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ నాటక సాహిత్యం పర్యావరణ అంశాలను విస్తృతంగా చర్చించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి సుభాషిణి, కార్యక్రమ సమన్వయకర్త యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ టెంపుల్ వద్ద బ్రిడ్జి నిర్మాణం

● రూ.70 లక్షలతో పనులు చేస్తున్న టీటీడీ



రోడ్డుకిరువైపులా జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

తిరుమల, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎన్ఎస్ టెంపుల్(లక్ష్మీనరసింహస్వామి ఆలయం) వద్ద రూ.70 లక్షలతో టీటీడీ బ్రిడ్జి నిర్మిస్తోంది. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల్లో 30 నుంచి 40 శాతం మంది మొక్కులు చెల్లించుకునేందుకు అలిపిరి కాలినడక మార్గంలో తిరుమలకు వస్తుంటారు. 3,600 మెట్లు కలిగిన ఈ మార్గంలో ఎన్ఎస్ టెంపుల్ నుంచి మోకాళ్లమిట్ట వరకు దాదాపు 1.6 కిలోమీటర్లు రోడ్డు వెంబడే నడవాల్సి వస్తుంది. ఎన్ఎస్ టెంపుల్ వద్ద మెట్లు దిగగానే రోడ్డును దాటాల్సి ఉంటుంది. ఈ ప్రదేశంలో వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి కాబట్టి ప్రమాదాలను నివారించేందుకు టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి ఏర్పాటు చేయాలని నిర్ణయించి పనులను ప్రారంభించింది. ఏప్రిల్ మొదటి వారానికి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

డాక్టరేట్ ప్రదానం


వసుధ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28: ఎస్వీ యూనివర్సిటీ సైకాలజీ విభాగ పరిశోధకురాలు పసుపులేటి వసుధ డాక్టరేట్ పొందారు. స్ట్రెస్, సోషియల్ సపోర్ట్ అండ్ సైకలాజికల్ వెల్-బీయింగ్ అమాంగ్ ఎల్డెర్లీ అంశంపై ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. వసుధ ఇప్పటి వరకూ పలు సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణలు చేశారు. ఈమె రూపొందించిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





చంద్రగిరి, ఫిబ్రవరి 28 : శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం వైభవంగా అంకురార్పణ జరిగింది. ఉదయం స్వామివారికి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను కల్యాణమండపానికి తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ, శుద్ధి, ఏకాంత సేవలు నిర్వహించారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, కంకణ భట్టర్ శేషాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, శేషాద్రి ఆచార్యులు, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగ్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహన సేవలు ప్రారంభం

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి తొమ్మిరోజుల పాటు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం 8.45 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు పెద్దశేష వాహనంతో వాహన సేవలు ప్రారంభం కానున్నాయి.

ఎస్వీయూలో రోడ్ల నిర్మాణంపై హైకోర్టు స్టే

జీవ వైవిధ్యానికీ రోడ్లు అవరోధమంటూ పిల్ దాఖలు చేసిన పూర్వ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28: ఎస్వీయూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్-2040 పేరుతో తిరుపతి నగరపాలక సంస్థ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై హైకోర్టు స్టే విధించింది. యూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో వేలాదిమంది విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని వర్సిటీ పూర్వ విద్యార్థులు అభిషేక్‌రెడ్డి, వీరపల్లి రవినాయుడు, దేవదీపక్, అనిరుద్ యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పర్యావరణ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫారెస్టు, వైల్డ్ లైఫ్ చీఫ్ కన్జర్వేటర్, కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్వీయూ రిజిస్ట్రార్, తుడా వైస్ చైర్మన్, తిరుపతి మున్సిపల్ కమిషనర్లను ప్రతి వాదులుగా చేర్చారు.ఈ కేసులో యూనివర్సిటీ లోపల విద్యార్థులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి రోడ్ల నిర్మాణం చేపట్టకూడదంటూ హైకోర్టు స్టే విధించింది.కొన్నాళ్ల క్రితం ఎస్వీయూలో మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఇందులో వంద అడుగులతో ఒకటి, 80 అడుగులతో రెండు రోడ్లు నిర్మించేందుకు సమాయత్తమైంది. దీనిపై యూనివర్సిటీ విద్యార్థులు తీవ్రస్థాయిలో ప్రతిఘటించారు. ఈ క్రమంలో హైకోర్టులో పూర్వ విద్యార్థులు దాఖలు చేసిన పిటీషన్‌లో అనేక అంశాలను పొందుపర్చారు.కేవలం విద్యార్థులకే కాకుండా, పర్యావరణానికీ, జీవ వైవిధ్యానికి ఈ రోడ్లు అవరోధం కలిగిస్తాయని వారు పేర్కొన్నారు. శేషాచల అభయారణ్యానికి యూనివర్సిటీ సమీపంలో ఉండడంతో అడవి కోళ్ళు, జింకలు, నెమళ్ళు, అనేక రకాల అరుదైన చెట్లు, మొక్కలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విపరీతమైన కాలుష్యం కూడా పెరిగి విద్యార్థుల భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. నడక, వ్యాయామం చేసుకోవడానికి ఇబ్బంది తలెత్తుతుందన్నారు. దీనిపై స్పందించి యూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా రద్దు చేయాలని హైకోర్టుకు పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

తూచ్!

స్వామి కాదు కృపాలక్ష్మి



● జీడీనెల్లూరుకు మూడోసారి సమన్వయ కర్త మార్పు

చిత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు వైసీపీ సమన్వయకర్తను అధిష్ఠానం మళ్లీ మార్చింది. తాజాగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్థానంలో ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరును బుధవారం రాత్రి ప్రకటించింది. ఇలా మార్పు చేయడం ఇది మూడోసారి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామికి టికెట్ రాకుండా ఆయన వ్యతిరేకవర్గం గట్టిగా పనిచేసిన విషయం.. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని చెప్పడం తెలిసిందే. దీంతో వైసీపీ అధిష్ఠానం తొలుత ఆయన్ను తప్పించింది. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు అసెంబ్లీకి.. నారాయణస్వామిని చిత్తూరు లోక్‌సభకు సమన్వయకర్తలుగా ప్రకటించింది. దీంతో నారాయణస్వామి వర్గమంతా ఆయనకే టికెట్ ఇవ్వాలంటూ అన్ని మండలాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించారు. నారాయణస్వామి కూడా సీఎం జగన్‌ను కలిసి జీడీనెల్లూరు నుంచి పోటీ చేసే అవకాశం మరోసారి ఇవ్వాలని గట్టిగా ప్రయత్నించి సఫలమయ్యారు. దీంతో రెండోసారి నారాయణస్వామి, రెడ్డెప్పకు పాత స్థానాలనే అప్పగించారు. అలా సిట్టింగ్ ఎమ్మెల్యేనే ఇన్‌చార్జి అయ్యారు. ఈసారి డిప్యూటీ సీఎం మేనల్లుడు తెరపైకి వచ్చి వ్యతిరేకంగా తయారయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ, తాజా జాబితాలో జీడీనెల్లూరు సమన్వయకర్తగా కృపాలక్ష్మి పేరుంది. వాస్తవానికి చాలాకాలం ముందు నుంచే నారాయణస్వామి తనకు బదులుగా తన కుమార్తెకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఆమె కూడా పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆమెకే టికెట్ అనే ప్రచారం జరిగినా, నియోజకవర్గంలోని పరిణామాల నేపథ్యంలో రెడ్డెప్ప.. తర్వాత నారాయణస్వామి పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు తన కుమార్తెను సమన్వయకర్తగా నియమించుకోవడంలో నారాయణస్వామి సఫలమయ్యారు.

భూ కబ్జాదారుడు సిద్ధుల రవిని అరెస్టు చేయాలి

● గుడిసెలు తొలగించిన ఎర్రగుట్టపైనే స్థలాలు చూపాలి

● సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి ● 15 రోజుల్లో పేదలకు న్యాయం చేస్తామని డీఆర్వో హామీ


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28 : కరకంబాడి ఎర్రగుట్టపై పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడమేగాక అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించి, పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం నేతలను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. భూ కబ్జాదారుడైన సిద్ధుల రవిని అరెస్టు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు అనువైన ప్రాంతంలో స్థలాలు చూపకపోవడంతో పేదలు అక్కడ గుడిసెలు వేయాల్సి వచ్చిందన్నారు. కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న పట్టాదారులకు స్థలాలు చూపించాలని, అంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. 15 రోజుల్లో పేదలకు స్థలాలు చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు సుబ్రహ్మణ్యం, మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, పోరాట కమిటీ నాయకులు హరి, రాజశేఖర్, సెల్వరాజు, శివానందం, సత్యప్రకాష్, శీను, సుజాతమ్మ, మమత, కుమారి, బీటీఆర్ కాలనీ నాయకులు మునిరత్నం, బాదుల్లా, మోదీను, అమీదు పాల్గొన్నారు.

హరిత విప్లవం కోసం ప్రయత్నం జరగాలి

● సైన్స్ డేలో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28: భారతరత్న డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదించిన హరిత విప్లవ సాధనకు అందరూ ప్రయత్నం చేయాల్సిన అవసరముందని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సైన్స్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నదున్నట్టు చూడమని సైన్స్ చెబుతుందన్నారు. మన దేశానికి ఏదో ఒక మంచి ఫలితాన్ని సాధించి ఇవ్వాలనే సంకల్పాన్ని ప్రతి విద్యార్థి ఏర్పరుచుకోవాలని కోరారు. ఇందుకోసం వివిధ రంగాల్లో రాణించిన శాస్త్రవేత్తల జీవితాన్ని చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఐసీఏఆర్ మాజీ రీసెర్చ్ డైరెక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ స్వామినాథన్ హరిత విప్లవం కోసమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, నేల తీరుపై పరిశోధనలు చేసి మంచి ఫలితాలు సాధించారన్నారు. రిజిస్ట్రార్ హుస్సేన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన విజయ్

భాకరాపేట, ఫిబ్రవరి 28: తిరుపతి-పీలేరు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ తెలిపారు.బుధవారం రాత్రి తిరుపతి నుంచి పీలేరుకు ద్విచక్ర వాహనంలో విజయ్ తన తల్లితో వెళుతూ రోడ్డు పక్కన ఆగివున్న ట్యాంకర్‌ను ఢీకొన్నాడు.ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పాకాల, ఫిబ్రవరి 28: దామలచెరువు గ్రంథాలయానికి బుధవారం దాతలు పలు పుస్తకాలను అందజేశారు. తోటతిమ్మయ్యగారిపల్లెకు చెందిన స్వర్గీయ రావిళ్ల సిద్దయ్యానాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మధుసూదన నాయుడు, హరిప్రసాద్, అశోక్ కుమార్, ఆయన సోదరుడు ఆర్. సిద్దయ్యానాయుడు రూ.20వేల విలువ కలిగిన 95 పుస్తకాలను గ్రంథాలయ ఇన్‌చార్జి మురళీబాబుకు అందజేశారు.


పాకాలలో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

ఘనంగా టైలర్స్ దినోత్సవం

పాకాల, ఫిబ్రవరి 28: చైతన్య టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాకాలలో బుధవారం టైలర్స్ డేని ఘనంగా జరుపుకొన్నారు. చాందీ చౌక్‌లో సమావేశమై సమస్యలపై చర్చించుకున్నారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ర్యాలీ నిర్వహించారు.అసోసియేషన్ అధ్యక్షుడు వేణుబాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, కార్యదర్శి శేఖర్ రెడ్డి, ట్రెజరర్ హబీబ్, సహకార్యదర్శి త్యాగరాజులు, గౌరవాధ్యక్షుడు చంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ

పాకాల, ఫిబ్రవరి 28: దామలచెరువు గ్రామ పంచాయతీ సిబ్బందికి బుధవారం యూనిఫాం, సోపులు, కొబ్బరినూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ ఇమ్రాన్, పంచాయతీ కార్యదర్శి మోతీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ భవనానికి శంకుస్థాపన

చంద్రగిరి, ఫిబ్రవరి 28: చంద్రగిరిలో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనానికి బుధవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.రూ.90 లక్షల తుడా నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, సర్పంచులు ముదికుప్పం రూపా రామ్మూర్తి, భాస్కర్‌రెడ్డి, మల్లం దీపికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇవ్వండి

చంద్రగిరి, ఫిబ్రవరి 28: పులివర్తి నానికి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని టీడీపీ యువనేత పులివర్తి వినీల్ కోరారు. బుధవారం చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయతీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ చంద్రగిరిలో అవినీతిరహిత పాలన పులివర్తి నానికే సాధ్యమవుతుందన్నారు.టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు,నాయకులు నాగరాజనాయుడు, పాలడుగు మురళీధర్, సజ్జా పురుషోత్తంనాయుడు, ధనంజయలు నాయుడు, సునీల్, మోహన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


నరసింగాపురం హైస్కూల్లో పిల్లలతో ఎంఈవో లలితకుమారి

చంద్రగిరి,ఫిబ్రవరి28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసింగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. సైన్స్ ఉపాధ్యాయులు కోదండపాణి, లతాదేవి పర్యవేక్షణలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారని హెచ్ఎం రామమూర్తి పేర్కొన్నారు.ఉత్తమ సైన్స్ ఎగ్జిబిట్స్‌కి, సైన్స్ టాలెంట్ టెస్ట్, వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు అందజేశారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

పాకాల, ఫిబ్రవరి 28: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా కోరారు. బుధవారం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.దామలచెరువు ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. పాఠశాలకు కుర్చీలను వితరణగా అందజేశారు.డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు మోహన్ బెహరా, రమేష్ కుమార్, ఈశ్వరబాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగూర్ బాషా, ప్రతినిధులు యాసానుల్లా, రెడ్డిబాషా, సతీష్, నాగూర్, మస్తాన్, మహ్మద్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి


ప్రదర్శనను సందర్శిస్తున్న ఎంఈవో గోపీనాథ్

భాకరాపేట, ఫిబ్రవరి, 28: ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలని ఎంఈవో-2 గోపీనాథ్ అన్నారు. బుధవారం భాకరాపేటలోని గీతాంజలి హైస్కూల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.విద్యార్థులతో తయారు చేయించిన వివిధ రకాల వంటకాలు ఆకట్టుకున్నాయి.సీఐ మస్తాన్‌వలి, కరస్పాండెంట్ గిరికుమార్‌రెడ్డి, హెచ్ఎం స్వాతి, సర్పంచ్ భూపాల్ పాల్గొన్నారు.

పాత శానంబట్లలో ఒకరి ఆత్మహత్య


హరిప్రసాద్ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 28: చంద్రగిరి మండలం పాత శానంబట్లలో ఓ వ్యక్తి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... పాతశానంబట్ల గ్రామానికి చెందిన హరిప్రసాద్(43) మంగళవారం రాత్రి కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చరిత ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేశారు. పేకాట ఆడి హరిప్రసాద్ అప్పుల పాలు కావడంతో సమీప బంధువుతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన హరిప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

ప్రతి కుటుంబానికీ రూ.5 వేలిస్తాం


చవటకాలువలో మాట్లాడుతున్న వేణుగోపాల రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికీ నెలనెలా రూ.5 వేలు అందిస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు కంచన వేణుగోపాల రెడ్డి చెప్పారు.తాటికోన, చవటకాలువ, బోనాకాలువ, రాయలపురం గ్రామాల్లో పర్యటించి మార్చి 1న తిరుపతిలో జరిగే కాంగ్రెస్ పార్టీ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.చంద్రగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కేపీ వాసు, నాయకులు కొణిదల రాజేంద్ర, రామ్మూర్తి, ఉషా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



భాకరాపేట, ఫిబ్రవరి 28: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జ్ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని టి.చెట్టేవారిపల్లెలో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని నిర్వహించారు.టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదన మోహన్, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్‌రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, సురేంద్ర, కొండారెడ్డి, కుమారస్వామిరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మౌలాలి, గురుమూర్తి, మురళి, బాలాజీ, ప్రతాపరెడ్డి, యశ్వంత్ రాయల్, వెంకటరత్నం, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 28 : రుయాస్పత్రిలో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, గురవయ్య కోరారు. ఈ విషయమై వారు బుధవారం రుయా సూపరింటెండెంట్ రవిప్రభును కలిసి సమ్మె నోటీసు అందించారు. రుయాస్పత్రిలో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులు పదోన్నతులు లేకుండా చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవుట్ సోర్సింగ్ కింద ఉన్న వారిని కాంట్రాక్టు కింద తీసుకోవాలని కోరారు. డిప్యూటేషన్‌పై దీర్ఘకాలంగా ఓటీ కేంద్రాల్లో స్థిరపడిపోయిన ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను తక్షణమే తిరిగి వారి విధులకు పంపాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే శుక్రవారం నుంచి ఉద్యోగులు సమ్మె బాట పడుతున్నారని తెలిపారు. నేత నరసింహులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న నీలం బాలాజీ, ముద్ర నారాయణ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28: బలిజలందరూ ఐక్యంగా ఉంటూ తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు బలిజ సంఘం నేతలతో కలిసి మాట్లాడుతూ పాత తిరుచానూరు రోడ్డులోని పెర్ఫెక్ట్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని, అందులో అన్ని విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 40 సంవత్సరాలుగా అన్ని రాజకీయ పార్టీలు బలిజలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మన అభివృద్ధిని, ఎదుగుదలను కాంక్షించే నాయకులకు అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. ఈ మేరకు అందరూ ఆత్మీయ సమావేశానికి హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, దూది కుమారి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్లు అనిల్‌రాయల్, వెంకటేష్ రాయల్, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ చిన్నముని, శేఖర్ రాయల్, దొరైరాజ్, సురేష్ రాయల్, చంద్ర, కిషోర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

భారత పారిశ్రామిక సమాఖ్య తిరుపతి జోన్ చైర్మన్‌గా పుష్పిత్‌గార్గ్



మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 28: భారత పారిశ్రామిక సమాఖ్య తిరుపతి జోన్ నూతన చైర్మన్‌గా పుష్పిత్‌గార్గ్, వైస్ చైర్మన్‌గా జగన్నాథ్‌ను నియమించినట్లు సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ ప్రకటించారు. బుధవారం ఓ ప్రైవేటు హోటల్లో సీఐఐ వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేయర్ డాక్టర్ శిరీష, స్విస్ లెర్నింగ్ ఎక్స్ఛేంజ్ చీఫ్ ఆఫీసర్ డాక్టర్ బసన్నపాతగుండి, జీసీ అడ్వైజరీ ఎండీ అండ్ సీఈవో పి.ప్రియాంక, ఇసుజు మోటార్స్ హెడ్ ఎన్.గోపాలకృష్ణన్, అమరరాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్‌తివారి, ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ సీఈవో ఎస్.ఎన్.గోస్వామి, కజారియా సిరామిక్స్ లిమిటెడ్ జీఎం విక్రమ్‌ఖైతాన్ హాజరై నూతన చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందించారు. అనంతరం సస్టైనబిలిటీ, ఈఎస్జీ, గ్లోబల్ సప్లై చైన్ వంటి అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు.

జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ జట్టు ఎంపిక


ఎంపికైన బాక్సింగ్ జట్టు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 28: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట క్రీడా సముదాయంలో బుధవారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ జట్టును ఎంపిక చేశారు. మార్చి 1నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. ప్రపంచ ఛాంపియన్ మైక్‌టైసన్‌ను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్ కోరారు. ఎంపికైన జట్టు పురుష విభాగంలో వై.ఆదర్శ్‌కుమార్, ఎన్.ధనుష్, ఎస్.శిశిందర్, వి.కార్తిక్, టి.తేజు, జి.కార్తిక్, కె.నిరంజన్, మహిళా విభాగంలో కె.గగన, వి.జ్యోత్స్న, యు.హర్ష ఉన్నారు.

సీనియర్ న్యాయవాది శ్రీధర్ మృతి


కె.ఎస్.శ్రీధర్ ఫైల్‌ఫొటో

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 28 : సీనియర్ న్యాయవాది కె.ఎస్.శ్రీధర్ బుధవారం చెన్నైలో మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొన్ని రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. 50సంవత్సరాలకు పైగా తిరుపతి కోర్టులో న్యాయవాదిగా సేవలందించిన ఆయన తిరుపతిలో పలు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. ఈ ఆలయ అభివృద్ధికి శ్రీధర్ విశేషంగా కృషి చేశారు. కాగా సందర్శకుల సౌకర్యార్థం ఆయన పార్థివదేహాన్ని కరకంబాడి రోడ్‌లోని అట్లాంటిస్ ది వరల్డ్ స్కూల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉంచుతామని శ్రీధర్ కుమారుడు, న్యాయవాది కె.ఎస్.వాసు తెలిపారు.

అక్రమ మద్యం వ్యాపారి అరెస్ట్

● రూ.34వేల మద్యం స్వాధీనం


సెబ్ అధికారుల అదుపులో వ్యాపారి, స్వాధీనం చేసుకున్న మద్యం

తిరుపతి (నేర విభాగం), ఫిబ్రవరి 28: పుదుచ్చేరి నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యాపారిని ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి అర్బన్ ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన చిన్నం బాలాజీ పాత రేణిగుంట రోడ్డులోని శ్రీనివాసపురంలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. పుదుచ్చేరి నుంచి రహస్యంగా మద్యం తీసుకువచ్చి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఎస్ఈబీ పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు.గదిలో దాచి ఉంచిన పుదుచ్చేరి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.34,980 ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్ఈబీ ఎస్ఐ స్వామినాథన్, హెడ్‌కానిస్టేబుళ్లు మనోహర్, సుధాకర్‌రాజు, కానిస్టేబుళ్లు చిరంజీవి, వినోద్ దాడుల్లో పాల్గొన్నారు.

సంకల్ప వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 28: వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. పురోహితుడు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త కొండె చెంగారెడ్డి, వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వాసు, రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీగా ఆర్‌పీఎఫ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28:కాపుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్‌పీఎఫ్) రాజకీయ పార్టీగా ఏర్పడబోతోందని ఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి శేఖర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయం తమకు భిక్ష కాదని, జన్మహక్కు అని, పోరాడి సాధించుకుంటామని అన్నారు. కాపులు, బలిజలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పార్టీ పెడుతున్నామని, త్వరలో జెండా, అజెండా, సిద్ధాంతాలను తెలుపుతామన్నారు.

ఆర్టీసీ కార్మికులకు జ్యూస్ వితరణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 28: విజయవాడకు చెందిన భద్రతా బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంట్రాక్టు కార్మికులకు శీతల పానీయాలు వితరణ చేశారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో కార్మికుల సౌకర్యార్థం 528 టెట్రా జ్యూస్ ప్యాకెట్లను బుధవారం ఆర్టీసీ ఇన్‌చార్జ్ పీవో, సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడుకు అప్పగించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.84 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.84 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 63,421 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,644 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, ఎమ్మెల్యేలు గణబాబు, కొండేటి చిట్టిబాబు బుధవారం స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపటి నుంచి ఆర్టీసీ ఉద్యోగుల నిరవధిక నిరాహార దీక్ష

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 28 : సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్షకు పూనుకుంటున్నట్లు ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తిరుపతి డిపో అధ్యక్షకార్యదర్శులు షణ్ముగం, రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అనేకసార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించినా స్పందన లేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజా రవాణాకు ఆటంకం లేకుండా అందుబాటులో ఉన్న ఉద్యోగులతో శుక్రవారం ఉదయం తిరుపతి డిపో ప్రధాన ద్వారం వద్ద దీక్ష చేపడతామని వివరించారు. అప్పటికీ స్పందించకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.



ఈత కొలనులో అపరిశుభ్రత, నాణ్యత లేని కొళాయిలు లైట్లు


నాసిరకం పనులు..నాణ్యత లేని వస్తువులు

మొక్కుబడిగా ఈత కొలను మరమ్మతులు - 29న ప్రారంభానికి సన్నాహాలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 28: శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఈత కొలను మరమ్మతు పనులు మొక్కుబడిగా చేశారు. నాసిరకం పనుల కారణంగా కొలను చుట్టూ అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. దీనికితోడు లైట్లు, టైల్స్ నాణ్యత లేనివి వాడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా క్రీడా విభాగం ఆధ్వర్యంలో కొలనును జనవరి, ఫిబ్రవరి నెలల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది టెండర్లను ఆహ్వానించకుండా విజయవాడ శాప్ ప్రధాన కార్యాలయమే జోక్యం చేసుకుని ఇంజనీరింగ్ విభాగం తయారు చేసిన అంచనాలతో పనులు చేపట్టింది. ఆయా జిల్లాలో తమ అనుకూలురకు క్లీనింగ్, మరమ్మతులు, ఇతర పనులను అప్పగించింది. పనిలో పనిగా స్కేటింగ్, బాల్ బ్యాడ్మింటన్, ఇండోర్ టెన్నిస్ వేదికల మరమ్మతు పనులను సైతం అప్పగించింది. జనవరిలో పనులు ప్రారంభించి ఫిబ్రవరి 16కు పూర్తి చేశారు. నాణ్యతా ప్రమాణాలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి హడావుడిగా పనులు పూర్తి చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొలను, మరుగుదొడ్లలో పాచి పొడలు పొడలుగా కనిపిస్తోంది. నాణ్యత లేని ఎల్ఈడీ ఫోకస్ చిన్నలైట్లు, బాత్‌రూమ్ షవర్స్ అమర్చారని క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లలో మరకలు కనిపిస్తున్నాయని అంటున్నారు. స్కేటింగ్ మైదానంలో ఫ్లోరింగ్ టైల్స్, లైట్లు, బాల్ బ్యాడ్మింటన్ కోర్టుల్లో ఏర్పాటు చేసిన నెట్ నాణ్యత లేవని ఆరోపిస్తున్నారు. ఇండోర్ స్టేడియంలో మ్యాట్ తెచ్చినా పరచకుండా గదిలో భద్రపరిచారు. దీన్నిబట్టి కేటాయించిన నిధుల్లో సగం కూడా వ్యయం చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీకాళహస్తి, సత్యవేడు క్రీడా సముదాయాల్లోనూ ఇదేవిధంగా మొక్కుబడిగా మరమ్మతులు, క్లీనింగ్ చేసినట్లు తెలుస్తోంది. విమర్శలను పట్టించుకోకుండా ఈనెల 29న కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడం గమనార్హం.

పరిశీలించి అధికారులకు వివరిస్తా..

శ్రీనివాస క్రీడా సముదాయం మరమ్మతు పనులు విజయవాడ శాప్ కార్యాలయ ప్రొసీడింగ్స్ ప్రకారం జరిగాయా లేదా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తి చేసినట్లు సంబంధిత కాంట్రాక్టర్ ఇంకా తెలియపరచలేదు. పనులు నాసిరకంగా ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. పరిశీలించి శాప్ ఇంజనీరింగ్ అధికారులకు వివరిస్తాం. నాణ్యత లోపంతో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించం.

- సయ్యద్‌సాహెబ్, జిల్లా క్రీడాకాధికారి

జూలై 20 నుంచి హనుమ అవార్డ్స్ పోటీలు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28 : అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జూలై 20 నుంచి 28వ తేదీ వరకు హనుమ అవార్డు పోటీలు నిర్వహిస్తున్నామని కమిటీ కార్యదర్శి బీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 24వ జాతీయస్థాయి భక్తిభావ పౌరాణిక పద్య నాటకాలు, సందేశాత్మక సంప్రదాయ సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద నృత్యాల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలకు ఏప్రిల్ 19వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని, మరిన్ని వివరాలకు 9581154667ను సంప్రదించాలని తెలిపారు.

132మంది ఉద్యోగాలకు ఎంపిక

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28: భవానీనగర్‌లోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 132 మంది వివిధ సంస్థల ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ ఉమ్మడి జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఎంపికైన వారికి నియామకపత్రాలను అందించి అభినందించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రమేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.




శ్రీనివాస స్కూల్‌లో సైన్స్ ప్రదర్శనలో ఎంఈవో బాలాజీ, కరస్పాండెంట్ సుబ్రమణ్యంరాజు - శ్రీచైతన్యలో ప్రదర్శించిన రాకెట్ నమూనాతో ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, టీచర్లు - భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రొఫెసర్ దామోదరం, టీచర్లు

విద్యాలయాల్లో ఘనంగా సైన్స్‌డే

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 28: తిరుపతిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో సీవీరామన్ జయంతి సందర్భంగా బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు వైజ్ఞానిక ఎగ్జిబిట్స్‌ని రూపొందించి ప్రదర్శించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

● **శ్రీనివాస హైస్కూల్‌లో:** మంగళం పరిధిలో సప్తగిరికాలనీలో ఉన్న శ్రీనివాస హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో బాలాజీతో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర అధ్యక్షుడు, కరస్పాండెంట్ వి.సుబ్రమణ్యంరాజుతో కలసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● **శ్రీచైతన్య స్కూల్‌లో:** జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను ఎస్వీయూ ప్రొఫెసర్ ఆర్‌పీ విజయలక్ష్మితో ఏజీఎం జి.సురేష్ కలసి ప్రారంభించి మాట్లాడారు. పీఎస్ఎల్‌వీ-3రాకెట్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, డీన్ సురేష్ పాల్గొన్నారు.

● **భాష్యం స్కూల్‌లో :** వరదరాజనగర్ పరిధిలోని శ్రీపురంకాలనీలో ఉన్న భాష్యం స్కూల్‌లో ఇట్స్ మై సైన్స్ ఎక్స్‌పో పేరిట నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎస్వీయూ పర్యావరణ శాస్త్ర విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ తోటి దామోదరంతో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ కలసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ బాలాజీ, లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జి సుధాకుమారి పాల్గొన్నారు.


నారాయణలో సర్టిఫికెట్లు పొందిన చిన్నారులతో టీచర్లు

● **నారాయణ స్కూల్‌లో:** న్యూ ఇందిరానగర్‌లోని నారాయణస్కూల్‌లో సైన్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ-కిడ్స్ చిన్నారులకు నిర్వహించిన అకడమిక్ ఫేర్‌ని ఏజీఎం కిశోర్ ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్ఐ వసంత్, ప్రిన్సిపాల్ హిమజ, కోఆర్డినేటర్స్ సుదర్శన్, దాక్షాయణి, తాసిన్, టీచర్లు పాల్గొన్నారు.

● **ఎంజీఎం స్కూల్‌లో:** బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం మురుగన్, సైన్స్ టీచర్ బండి మధుసూదన్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

● **ఎస్పీజేఎన్ఎం స్కూల్‌లో:** స్థానిక ఎస్పీజేఎన్ఎం స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని డీఈవో డాక్టర్ వి.శేఖర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కేడీ సారథి, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈవో బాలాజీ, హెచ్ఎం మునిశేఖర్, టీచర్లు పాల్గొన్నారు.

వైసీపీ, బీజేపీలను ఓడించే పార్టీలతో కలుస్తాం

● సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న గిడుగు రుద్రరాజు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28: రాష్ట్రంలో వైసీపీ, కేంద్రంలో బీజేపీని ఓడించే పార్టీలతో కలిసి పనిచేస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. జైలు, బెయిల్‌పై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతున్న వైసీపీని సాగనంపాలన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని శ్రీవారి పాదాల చెంత చెప్పి మాట తప్పిన నరేంద్రమోదీకి, అధికారమిస్తే కేంద్రం మెడలు వంచి హోదా తీసుకువస్తానన్న జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. గత ఎన్నికల సమయంలో మోదీని దూషించిన చంద్రబాబు నేడు అధికారం కోసం వారితో పొత్తు కోసం వెంపర్లాడడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు ఏర్పాటు చేసి, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ తాము అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరిస్తామని తెలిపారు. కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ఇప్పటికే రాహుల్‌గాంధీ చెప్పారన్నారు. శుక్రవారం తిరుపతి ఎస్వీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగా గౌతమ్, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్, రాంభూపాల్‌రెడ్డి, శ్రీరామమూర్తి, శంకర్, యార్లపల్లి గోపి, చిట్టిబాబు, జావేద్, లీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్వీయూ హెచ్-బ్లాక్ హాస్టల్‌లో కేంద్ర బలగాలకు వసతి!

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు - ప్రత్యామ్నాయం చూడాలని ఏఐఎస్ఎఫ్ సూచన

తిరుపతి(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 28: ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు రానున్న కేంద్ర బలగాలకు ఎస్వీ యూనివర్సిటీలోని హెచ్-బ్లాక్ హాస్టల్‌లో వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే దీనిపై ప్రస్తుతం ఆ హాస్టల్‌లో వసతి, భోజన సదుపాయాలు పొందుతున్న విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఉన్నపలంగా మరో హాస్టల్‌కు పంపడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బీపీఈడీ విద్యార్థులను సంబంధిత హెడ్ ద్వారా ఒత్తిడి చేయించి ఖాళీ చేయించారని ఆరోపించారు. మిగతా విద్యార్థులను కూడా ఇదేరకంగా ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఖాళీ చేయకపోతే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి యూనివర్సిటీ అధికారులకు కానీ, యూనివర్సిటీ అధికారుల నుంచి తమకు కానీ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలా వసతి కల్పిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కాగా, ఆర్ట్స్ పీజీ ఫస్టియర్ విద్యార్థులు సుమారు 150 మంది హెచ్-బ్లాక్ హాస్టల్‌లో వసతి పొందుతున్నారు. వీరిని ఖాళీ చేయించి, ప్రత్యామ్నాయంగా మరోచోట వసతి కల్పిస్తామని చెప్పడం వివాదాస్పదంగా మారుతోంది. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న మిగతా బ్లాకుల్లో వసతి కల్పిస్తే తమకు అభ్యంతరం లేదని ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి సుందరరాజు స్పష్టం చేశారు.

నేషనల్ స్కాలర్స్ పార్టీకి మద్దతివ్వండి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

తిరుపతి (తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28 : ప్రస్తుత రాజకీయాల్లో ఉన్నత విద్యావంతులు కరువవుతున్నారని, అలాంటి వారే సభ్యులుగా ఏర్పడిన నేషనల్ స్కాలర్స్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యూజీసీ బడ్జెట్‌లో 6,900 కోట్ల రూపాయలను కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం నిరుద్యోగుల సంఖ్య 12కోట్లుగా ఉందని ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంటోందని తెలిపారు. ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, శ్రీనివాసరావు, శ్రీవిద్య, వెంకట్ నాయక్ పాల్గొన్నారు.

వేదవర్సిటీలో విమానశాస్త్రంపై సదస్సు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీలో బుధవారం ప్రాచీనభారత విమానశాస్త్ర అనే శీర్షికపై ఉపన్యాస సదస్సు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ హాజరై మాట్లాడుతూ వేదఇతిహాస శాస్త్రాలలో నిగూఢమై ఉన్న వైజ్ఞానిక అంశాలను విశదీకరించారు. ప్రధానంగా భరద్వాజ మహర్షి రచించిన బృహత్ యంత్ర సర్వస్వంలోని విమానశాస్త్ర పరిచయాన్ని వివరించారు. వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ మహాభారతంలో 350కిపైగా శాస్త్రాలు ఉన్నాయని, వీటిని అధ్యయనం చేసి సనాతన ధర్మాన్ని ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, రాధేశ్యామ్, సౌమ్యనారాయణ, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తూచ్!

నారాయణ స్వామి కాదు కృపాలక్ష్మి

జీడీనెల్లూరుకు మూడోసారి సమన్వయ కర్త మార్పు



చిత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు వైసీపీ సమన్వయకర్తను అధిష్ఠానం మళ్లీ మార్చింది. తాజాగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్థానంలో ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరును బుధవారం రాత్రి ప్రకటించింది. ఇలా మార్పు చేయడం ఇది మూడోసారి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామికి టికెట్ రాకుండా ఆయన వ్యతిరేకవర్గం గట్టిగా పనిచేసిన విషయం.. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని చెప్పడం తెలిసిందే. దీంతో వైసీపీ అధిష్ఠానం తొలుత ఆయన్ను తప్పించింది. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు అసెంబ్లీకి.. నారాయణస్వామిని చిత్తూరు లోక్‌సభకు సమన్వయకర్తలుగా ప్రకటించింది. దీంతో నారాయణస్వామి వర్గమంతా ఆయనకే టికెట్ ఇవ్వాలంటూ అన్ని మండలాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించారు. నారాయణస్వామి కూడా సీఎం జగన్‌ను కలిసి జీడీనెల్లూరు నుంచి పోటీ చేసే అవకాశం మరోసారి ఇవ్వాలని గట్టిగా ప్రయత్నించి సఫలమయ్యారు. దీంతో రెండోసారి నారాయణస్వామి, రెడ్డెప్పకు పాత స్థానాలనే అప్పగించారు. అలా సిట్టింగ్ ఎమ్మెల్యేనే ఇన్‌చార్జి అయ్యారు. ఈసారి డిప్యూటీ సీఎం మేనల్లుడు తెరపైకి వచ్చి వ్యతిరేకంగా తయారయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ, తాజా జాబితాలో జీడీనెల్లూరు సమన్వయకర్తగా కృపాలక్ష్మి పేరుంది. వాస్తవానికి చాలాకాలం ముందు నుంచే నారాయణస్వామి తనకు బదులుగా తన కుమార్తెకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఆమె కూడా పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆమెకే టికెట్ అనే ప్రచారం జరిగినా, నియోజకవర్గంలోని పరిణామాల నేపథ్యంలో రెడ్డెప్ప.. తర్వాత నారాయణ స్వామి పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు తన కుమార్తెను సమన్వయకర్తగా నియమించుకోవడంలో నారాయణస్వామి సఫలమయ్యారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే వారికే

ఎన్నికల్లో మద్దతు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ
- దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి మార్చి 9న ఛలో విజయవాడ



సభలో ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 28: ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీకి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తిరుపతిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలపై మార్చి 9 వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం జగన్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 1990 లో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు వర్గీకరణకు న్యాయం చేశారని చెప్పారు. దీని ఫలితంగా 22 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రధాని మోదీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇందువల్ల ప్రధాని మోదీకి, బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్, జాతీయ నాయకులు నరేంద్రబాబు, నాయకులు రాజేంద్ర, పెంచలయ్య, రాధాకృష్ణ, గోపీ, ప్రకాష్, రవీంద్ర, రామకృష్ణ, వాసు, చిన్న, మురళి, దేవరాజ్, నరసింహ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ ప్రకటించిన

ప్రాంతంలోనే 'ప్రత్యేక తరగతి సాధన సభ'

పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

తిరుమల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోదీ తిరుపతిలో ఎక్కడి నుంచి హామీ ఇచ్చారో అక్కడే తమ పార్టీ 'ప్రత్యేక తరగతి సాధన సభ' నిర్వహించబోతున్నట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు.బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చి 1వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో భారీ బహిరంగ సభను తిరుపతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సచిన్ పైలట్, రఘువీరారెడ్డి, శైలజానాథ్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌పార్టీ చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు.త్వరలో గుంటూరు, విశాఖపట్నం నగరాల్లో బహిరంగ సభలకు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారన్నారు.

ఎస్ఐల బదిలీ

చిత్తూరు, ఫిబ్రవరి 28: పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ చిత్తూరు ఎస్పీ జాషువా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఎ.వెంకట నారాయణ నింద్రకు,ఎస్.వెంకటరాముడు విజయపురానికి, జి.రామ చంద్రయ్య నగరికి బదిలీ అయ్యారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పిచ్చాటూరు, ఫిబ్రవరి 28: మండలంలోని రామగిరి దేవాలయంలో మార్చి 8న జరుగు మహాశివరాత్రి ఉత్సవ క్యాలెండర్లను బుధవారం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ సురేష్ ఆలయ సిబ్బందితో కలసి ఉత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సింగిల్‌విండో ఛైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ఏర్పేడు, ఫిబ్రవరి 28: మండలంలోని వ్యాసాశ్రమం సమీపంలో రైల్వేట్రాక్‌పై పాతికేళ్ల యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. యువకుడి మృతదేహంపై పూజ, దాక్షాయని అనే పచ్చబొట్లున్నాయి. శ్రీకాళహస్తి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహ యాదవ్ యువకుడి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తుపడితే శ్రీకాళహస్తి రైల్వేపోలీసులను సంప్రదించాలని ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు

రేణిగుంటలో ఏడు టెన్త్ పరీక్షా కేంద్రాలు

రేణిగుంట,ఫిబ్రవరి28: మండలంలో ఏడు కేంద్రాల్లో పదవతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఇందిరాదేవి పేర్కొన్నారు. మండలంలోని రేణిగుంట జిల్లా పరిషత్ బాలుర,బాలికోన్నత పాఠశాలలు, ఆర్‌సీఎం, శ్రీవిద్యా కాన్వెంట్, నాగార్జున స్కూలు, శ్రీచైతన్య, ఎస్వి హైస్కూలు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, పదవ తరగతి పరీక్షలకు 1257 మంది రెగ్యూలర్ విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షలు మార్చి18నుంచి 30వ తేది వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం12.45 గంటల మధ్య నిర్వహిస్తామని తెలిపారు.

రోగులకు ఉచిత రవాణా సదుపాయం



శ్రీబాలాజీ ఆస్పత్రిలో ఉచితబస్సు ప్రారంభించిన డీన్ డాక్టర్ ప్రేమానందం

రేణిగుంట,ఫిబ్రవరి28: విమానాశ్రయం సమీపంలో వున్న శ్రీబాలాజీ ఆస్పత్రికి వైద్యపరీక్షల కోసం వచ్చే రోగుల సౌకర్యార్థం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కొమ్మా ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ఈ బస్సు రేణిగుంట నుంచి ఆస్పత్రి వరకు ప్రతిరోజు ఉదయం9 నుంచి సాయంత్రం4గంటల వరకు రోగులకు సేవలందిస్తుందని పేర్కన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్ రెడ్డి, హెచ్‌ఆర్ డైరెక్టర్ నాగరాజు, డాక్టర్ బ్రహ్మనందం, ఏఓలు చైతన్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దుష్ట పాలనను పారదోలండి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, ఫిబ్రవరి 28: రాష్ట్రాభివృద్ధిని మరచి, దుష్ట పాలన సాగిస్తున్న వైసీపీని పారదోలాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు అధ్యక్షతన ఎమ్మెల్యే అభ్యర్థిని డాక్టర్ నెలవల విజయశ్రీ పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నేత కంకణాల రామ్మోహన రావుకు సంతాపం ప్రకటించారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంక్షేమం మాటున దోచుకున్న డబ్బుతో అక్రమాలకు పాల్పడి మరోమారు గద్దెనెక్కేందుకు జగన్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టించి పని చేయాలన్నారు. నారా లోకేశ్ చరవతో పార్టీలో యవతకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ క్రమంలోనే భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా నెలవల విజయశ్రీకి అవకాశం ఇచ్చారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి టీడీపీని గెలిపించి నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువద్దామని అన్నారు. ఈ సందర్భంగా ఆరిమేనిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గుంటమడుగు రవీంద్రరాజు, గుంటమడుగు సోమశేఖర్‌రాజు, కొండూరు మల్లిఖార్జున్‌రాజు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నియోజకవర్గ తెలుగు మహిళాఉపాధ్యక్షురాలు సుజాతమ్మ, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, యువ నేత కంకణాల సత్యవరప్రసాద్‌రావు, మండల బీసీసెల్ అధ్యక్షుడు వంకాయల వెంకటేశ్వర్లుతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

సైన్సుతోనే మానవ మనుగడ



కనమనంబేడు పాఠశాలలో విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు, హెచ్ఎం



బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ



చిన్నపాండూరులో విద్యార్థులు వేసిన చిత్రం



సంతవేలూరులో విద్యార్థులు వేసిన చిత్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 28: సైన్సుతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురష్కరించుకుని మండలంలోని కనమనంబేడు కల్లివెట్టు, బుచ్చినాయుడుకండ్రిగ, నెలవాయి తదితర పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు సైన్సు ప్రయోగాలను చేసి ప్రదర్శించారు. బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రాజశేఖరు, రూపేష్ కుమార్ బహుమతులను అందజేశారు.

వరదయ్యపాళెం: మండలంలోని పలు ప్రభుత్వప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని వరదయ్యపాళెం, పాండూరు, సంతవేలూరు, గోవర్ధనపురం, బత్తలవల్లం ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో ఈ సైన్స్ దినసోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలో ప్రభుత్వప్రైవేటు పాఠశాల్లో బుధవారం జాతీయ సైన్స్‌దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమరరాజా విద్యాలయంలో విద్యార్థులు చేసిన ఆవిష్కరణలను ప్రిన్స్‌పల్ గ్లోరీ దేవప్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పల్ జయంతి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. కరకంబాడి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన ఆవిష్కరణలను జిల్లా విద్యాశాఖాదికారి వి.శేఖర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్ప, యుటిఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, సైన్స్ టీచర్లు సుధారాణి, నాగరాజు,మురళి, గోపి,సుశీల,నీలకంఠ పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లోజాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు.



కరకంబాడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శన పరిశీలిస్తున్న డీఈవో వి.శేఖర్



అమరరాజా విద్యాలయంలో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

భూ కబ్జాదారుడు సిద్ధుల రవిని అరెస్టు చేయాలి

గుడిసెలు తొలగించిన ఎర్రగుట్టపైనే స్థలాలు చూపాలి ● సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

15 రోజుల్లో పేదలకు న్యాయం చేస్తామని డీఆర్వో హామీ



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: కరకంబాడి ఎర్రగుట్టపై పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడమేగాక అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించి, పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం నేతలను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. భూ కబ్జాదారుడైన సిద్ధుల రవిని అరెస్టు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు అనువైన ప్రాంతంలో స్థలాలు చూపకపోవడంతో పేదలు అక్కడ గుడిసెలు వేయాల్సి వచ్చిందన్నారు. కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న పట్టాదారులకు స్థలాలు చూపించాలని, అంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. 15రోజుల్లో పేదలకు స్థలాలు చూపిస్తామని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సుబ్రహ్మణ్యం, మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, పోరాట కమిటీ నాయకులు హరి, రాజశేఖర్, సెల్వరాజు, శివానందం, సత్యప్రకాష్, శీను, సుజాతమ్మ, మమత, కుమారి, బీటీఆర్ కాలనీ నేతలు మునిరత్నం, బాదుల్లా, మోదీను, అమీదు పాల్గొన్నారు.



రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న జేసీ శుభం బన్సల్

రైతుల ఖాతాల్లో రూ.36.29కోట్లు: జేసీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రైతు భరోసా- పీఎం కిసాన్ కింద 1,80,763మంది రైతుల ఖాతాల్లో రూ.36.29కోట్లు, పంట రుణాలకు సున్నా వడ్డీ కింద రూ.3.93 కోట్లు జమ చేసినట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం ఇందుకు సంబంధించిన నమూనా చెక్కును ఆయన రైతులకు అందజేశారు.జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారిణి గీతారాణి, వ్యవసాయ సలహామండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో రోడ్ల నిర్మాణంపై హైకోర్టు స్టే

- జీవ వైవిధ్యానికీ రోడ్లు అవరోధమంటూ పిల్ దాఖలు చేసిన పూర్వ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28: ఎస్వీయూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్-2040 పేరుతో తిరుపతి నగరపాలక సంస్థ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై హైకోర్టు స్టే విధించింది. యూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో వేలాదిమంది విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని వర్సిటీ పూర్వ విద్యార్థులు అభిషేక్‌రెడ్డి, వీరపల్లి రవినాయుడు, దేవదీపక్, అనిరుద్ యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పర్యావరణ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫారెస్టు, వైల్డ్ లైఫ్ చీఫ్ కన్జర్వేటర్, కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్వీయూ రిజిస్ట్రార్, తుడా వైస్ ఛైర్మన్, తిరుపతి మున్సిపల్ కమిషనర్లను ప్రతి వాదులుగా చేర్చారు.ఈ కేసులో యూనివర్సిటీ లోపల విద్యార్థులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి రోడ్ల నిర్మాణం చేపట్టకూడదంటూ హైకోర్టు స్టే విధించింది.కొన్నాళ్ల క్రితం ఎస్వీయూలో మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఇందులో వంద అడుగులతో ఒకటి, 80 అడుగులతో రెండు రోడ్లు నిర్మించేందుకు సమాయత్తమైంది. దీనిపై యూనివర్సిటీ విద్యార్థులు తీవ్రస్థాయిలో ప్రతిఘటించారు. ఈ క్రమంలో హైకోర్టులో పూర్వ విద్యార్థులు దాఖలు చేసిన పిటీషన్‌లో అనేక అంశాలను పొందుపర్చారు. కేవలం విద్యార్థులకే కాకుండా, పర్యావరణానికీ, జీవ వైవిధ్యానికి ఈ రోడ్లు అవరోధం కలిగిస్తాయని వారు పేర్కొన్నారు. శేషాచల అభయారణ్యానికి యూనివర్సిటీ సమీపంలో ఉండడంతో అడవి కోళ్ళు, జింకలు, నెమళ్ళు అనేక రకాల అరుదైన చెట్లు, మొక్కలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విపరీతమైన కాలుష్యం కూడా పెరిగి విద్యార్థుల భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. నడక, వ్యాయామం చేసుకోవడానికి ఇబ్బంది తలెత్తుతుందన్నారు. దీనిపై స్పందించి యూనివర్సిటీలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా రద్దు చేయాలని హైకోర్టుకు పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలకు సమాయత్తమవుదాం: టీడీపీ



టీడీపీలో చేరిన యువతతో గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 28: గ్రామాల్లో అన్ని వర్గాలను కలుపుకుని ఎన్నికలకు సమాయత్తమవుదామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని మంచినీళ్ల బావి వీధిలో రూరల్‌కు సంబంధించి తడుకు, శిరుగురాజుపాళెం పంచాయతీల పరిధిలోని ఆరు పోలింగ్‌బూత్‌ల పరిధిలోని టీడీపీ, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఓటర్లను నేరుగా కలిసి ప్రచారం పూర్తి చేసినందున ఇక నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించాలని సూచనలిచ్చారు. ప్రతి బూత్ పరిధిలో మెజార్టీ సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శిరుగురాజుపాళెంకు చెందిన నాగరాజు, బాలాజీ, మనోజ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్, కరుణా యాదవ్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

మసీదుల నిర్మాణానికి రూ.197.70 లక్షల మంజూరు

పుత్తూరు ఫిబ్రవరి 28: నగరి నియోజకవర్గంలో మసీదులు, దర్గాల పునర్నిర్మాణం, ప్రహరీ నిర్మాణాలకు రూ.197.70 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి రోజా తెలిపారు. ఇందులో పుత్తూరు మండలంలోని గేటు పుత్తూరు, షాపు బావి వీధి, ఎన్‌జీవో కాలనీ, భవానీ నగర్, చిన్నబ్బనాయుడు కండ్రిగ, నగరి మండలంలో వేలావడి, ఎమ్‌ఎస్‌పాలెం, తడుకుపేట, నగరిలో రెండు, వడమాలపేట, విజయపురం, నింద్ర మండలాల్లో ఒక్కో మసీదు వున్నాయని పేర్కొన్నారు.

పుత్తూరు వార్తలు

మార్కెట్ వేలం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 28: మున్సిపల్ పరిధిలో దినసరి కూరగాయాల మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్ బస్టాండ్‌లో గుత్త వసూలుకు బుధవారం వేలం పాటను కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి నిర్వహించారు. దినసరి కూరగాయాల మార్కెట్ రూ.19.51 లక్షలు, ప్రైవేటు బస్టాండ్ రూ.14.89 లక్షలు, జంతువధశాల రూ.4.87 లక్షలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ నేతలకు భానుప్రకాష్ పరామర్శ



మునిరత్నం నాయుడును పరామర్శిస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 28: మండలంలోని పాదిరేడులో అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకులను ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న మునిరత్నం నాయుడు, ప్రమాదంలో గాయపడిన సురేష్‌ను పరామర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పాదిరేడు క్లస్టర్ ఇన్‌చార్జి ధనంజయులు నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాముయాదవ్, నాయకులు అనంతసేన, చందు, బత్తి నాయుడు, ఉదయ్‌యాదవ్, జగదీష్, విజేంద్రయ్య, మనోహర్, ప్రవీణ్, హేమంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు: ఎస్పీ



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మలిక గర్గ్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 28: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ, అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ మలిక గర్గ్ సూచించారు. పుత్తూరు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో బుధవారం రూరల్ సీఐ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు, హత్య కేసు ముద్దాయిలు, పాత నేరస్తులపై షీట్లు ఓపెన్ చేసి కట్టడి చేయాలని ఆదేశించారు. సబ్ డివిజన్ తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉండడంతో పోలీసులు మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇటు మన రాష్ట్రం నుంచి అటు తమిళనాడు నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అన్ని రహదారులపైన నిఘా పటిష్టం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా సారా, గంజాయి, ఎర్రచందనం, మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సూచనలిచ్చారు. రానున్న ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అందుకుగాను ఎస్‌హెచ్‌వోలు పూర్తి బాధ్యత తీసుకోవాలని చెప్పారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా మెలగాలని, అసభ్యంగా ప్రవర్తిస్తే ఎంతటి అధికారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదన్నారు. చిన్నపిల్లలు, మహిళల రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఇబ్బంది కలిగినట్లు సమాచారం వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించాలన్నారు. ఎలాంటి బలమైన ఆధారాలు లేకుండా అమాయకులను, బలహీనులను స్టేషన్‌లో నిర్బంధించడం, తప్పుడు కేసులు నమోదు చేస్తే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, అధికారులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, అవినీతి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. అనంతరం సురుటుపల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించి సూచనలిచ్చారు. ఆమె వెంట పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, సీఐలు ఓబులేశు, భాస్కర్‌నాయక్, దివాకర్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు ఉన్నారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

వడమాలపేట, ఫిబ్రవరి 28: తపాలశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ ఏఎస్పీ ఆర్ముగం కోరారు. డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం వడమాలపేటలో తపాలశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ర్యాలీలో సబ్ పోస్ట్‌మాస్టర్ కిషోర్, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ వెంకమరాజు, శేఖర్ ప్రసాద్, రమణ, భాస్కర్‌రాజు, దేవప్రసాద్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం



సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, డాక్టర్ హరిబాబు, నరసింహారెడ్డి, శాంసన్ రాజు, సుజన, పద్మావతి, గాయత్రీ, షర్మిల, శంకర్రావు, కృష్ణయ్య, సుజల, సురేష్, రఘురామన్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు


స్వరూపానందకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ముక్కంటి ఆలయ అధికారులు, అర్చకులు

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామిని ఆలయాధికారులు ఆహ్వానించారు. బుధవారం ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అధికారులు మల్లికార్జున ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు పరిశీలించారు. ఇందులో భాగంగా బుధవారం వాహనాల మండపం, సన్నిధి వీధిలో డబల్ రోడ్డు నిర్మాణం, భక్తుల బస కోసం నిర్మిస్తున్న నూతన షెడ్డు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ సమీక్ష

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆలయంలోని త్రినేత్ర అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యపరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏర్పేడు, ఫిబ్రవరి 28: మండలంలోని మునలిపేడు గ్రామం పాండురంగస్వామి ఆలయం వద్ద రాస్, టాటా ట్రస్టు ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టాటా ట్రస్టు వారు సుమారు 150మంది వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ మహిళా భారతి ఫీల్డ్ అధికారి వెంకటకుమార్, దేవకమ్మ, కుమారమ్మ, మునీంద్ర, కృష్ణవేణి, హేమంత్, వెంకయ్యబాబు, రాస్ సిబ్బంది, టాటా ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూములివ్వాలి: సీపీఎం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 28: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో సర్వే నెంబరు 81లో స్థానికేతరుల పట్టాలు రద్దుచేసి భమిలేని దళితులకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం దళితులతో కలసి ధర్నా చేశారు. . ఈ సందర్భంగా అర్హులైన దళితులకు భూమి పట్టాలు ఇవ్వాలని కోరుతూ జాబితా ను తహసీల్దార్ ఆలీఖాన్‌కు అందజేశారు. రమేష్, నాగరాజు, మరళి, రమణయ్య, ధనంజయులు, జేకే రమణయ్య, తిరుపాలు, మణి ఆచారి దళితులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణలపై క్షుణ్ణంగా పరిశీలించాలి

ఓటర్ల జాబితాలో సవరణలు క్షుణంగా పరిశీలించాలని తహసీల్దార్ ఆలీ ఖాన్ తెలిపారు. బీఎన్ కండ్రిగ మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 35 పోలింగ్ బూత్‌లలో ఫారం 6, 7, 8, 8ఏ ద్వారా పూర్తి స్థాయిలో పరిశీలిన చేయాలన్నారు. మృతి చెందిన వారు. గ్రామ వదలి వెళ్లిన వారు, మృతి చెందిన వారు వివరాలను కూడా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, సీనియర్ సహాయకులు నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో తనిఖీ కేంద్రాలు: ఎస్పీ


సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

సత్యవేడు, ఫిబ్రవరి 28: సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆమె సత్యవేడు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సత్యవేడు తమిళనాడుకు సరిహద్దున ఉండడం వల్ల ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరంతరం కొనసాగేలా పరిశీలిస్తామన్నారు. అంతకు ముందు స్థానిక సీఐ, ఎస్ఐ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్బీబీ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, ఎస్పీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, తదితరులున్నారు.

సురుటుపల్లె చెక్‌పోస్ట్ తనిఖీ

నాగలాపురం, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని సురుటుపల్లె పోలీస్ చెక్‌పోస్టును బుధవారం తిరుపతి ఎస్పీ మల్లిక గార్గ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ చెక్‌పోస్టులో పనిచేస్తున్న పోలీస్ అధికారులతో అక్కడి పరిస్థితులు, వాహనాల రాకపోకలు గురించి అడిగి తెలుసుకున్నారు. సురుటుపల్లె చెక్‌పోస్ట్ తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ తనిఖీ కేంద్రాలను నిరంతరం కొనసాగేలా పరిశీలిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి తమిళనాడు ఊత్తుకోటలోని సరిహద్దు పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆపి అక్కడి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ రాజేంద్ర, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువశక్తితోనే రాష్ట్రానికి ఉన్నత భవిష్యత్: సుధీర్


బైక్ ర్యాలీలో బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఫిబ్రవరి 28: యువశక్తితోనే రాష్ట్రానికి ఉన్నత భవితవ్యం సాధ్యమని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర భవిష్యత్తు కోసం యువతకు పిలుపునిస్తూ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేశారు. పట్టణంలోని ఏపీ సీడ్స్ కూడలి వద్ద సుధీర్ రెడ్డి బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ పాలనతో రాష్ట్ర భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. యువత, విద్యార్థులు భావితరాల భవిష్యత్తు దృష్ట్యా వచ్చే ఎన్నికలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రజలను భయభ్రాంతులను చేస్తూ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.. వచ్చే ఎన్నికల్లో యువశక్తి సత్తా ఏంటో వైసీపీకి చూపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి హేమంత్, ఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు శశి తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

వైసీపీ నుంచి టీడీపీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గోపాలపురం గ్రామస్తులు సుమారు వందమంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారిని సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు, సతీష్, మణి, విజయ్‌కుమార్, బలరామయ్య, చంద్ర, రమణమ్మ, శివ, చలపతి పాల్గొన్నారు.

అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి, చిన్నకనపర్తి కొన్నలి గ్రామాలలో బొజ్జల రిషితారెడ్డి ,ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ జయరామయ్యతో పాటు మరికొంతమంది టీడీపీలో చేరారు. వారిని రిషితారెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మునిరాజనాయుడు, వెంకటాచలం, జడ్పీటీసీలు అర్చనాదేవి, తిరుమలయ్య నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి,చంచయ్యనాయుడు, ఈశ్వర్‌రెడ్డి ,మునిరత్నం పాల్గొన్నారు.

ఒకే రోజు రెండిళ్లలో చోరీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28: శ్రీకాళహస్తి పట్టణ శివారులో ఒకే రోజు రెండిళ్లల్లో చోరీలు జరిగిన ఘటన బుధవారం వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు...ఓ వార్తా పత్రిక విలేకరి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి రాజీవ్ నగర్ సమీపంలోని జర్నలిస్టు కాలనీలో చోటు చేసుకుంది. పాత్రికేయురాలు చాన్ బేగం జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి కాలనీలోనే ఉన్న తన స్నేహితురాలు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు చాన్ బేగం ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన చాన్ బేగం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించి శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రారాజు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తిరుపతి నుంచి క్లూస్ టీం ఏఎస్ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో రాజీవ్ నగర్‌కు చేరుకుని వేలి ముద్రలు సేకరించారు. 36 గ్రాముల బంగారు ఆభరణం చోరీ జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా పట్టణంలోని కైలాసగిరి కాలనీకి చెందిన మహబూబ్ అనే మహిళ మంగళవారం రాత్రి బంధువుల ఇంట్లో నిద్రపోయి, ఉదయం ఇంటికి రాగా, 5 గ్రాముల బంగారు వస్తువు చోరీ జరిగినట్లు గుర్తించి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్లూస్ టీం నమూనాలు సేకరించింది. రెండు చోరీలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేప్పట్టారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం ఎస్సై సతీష్ కుమార్

చాన్‌బేగం ఇంట్లో చిందర వందరగా ఉన్న వస్తువులు

చట్టాలపై అవగాహన పెరగాలి


సమాజంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28: చట్టాలపై అందరికీ అవగాహన పెరగాలని న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం పానగల్ సచివాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ... జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు సదస్సు నిర్వహించామని తెలిపారు. ఉచిత న్యాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతితోనే అభివృద్ధి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 28: సాంకేతిక ప్రగతి తోనే దేశాభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని కళాశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీలత సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎంజీఎం, శ్రీ చైతన్య తోపాటు పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం నిర్వహించారు.

కాంగ్రెస్‌తో కలసి పని చేసేందుకు సిద్ధం

● ప్రజాసేవ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాలగురవం బాబు

సత్యవేడు, ఫిబ్రవరి 28: తాము కాంగ్రెస్ పార్టీతో కలసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రజాసేవ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాలగురవం బాబు చెప్పారు. బుధవారం సత్యవేడు ప్రెస్ క్లబ్ సమావేశంలో ఆయన పలువురు పార్టీ నేతలతో కలసి పలు అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో కలసి తమ పార్టీ పనిచేయడానికి ఇప్పటికే ఆ పార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపామన్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ తరపున సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను బరిలో దింపేందుకు కాంగ్రెస్ హై కమాండ్ స్పష్టమైన సంకేతాలిచ్చిందన్నారు. ఈ మేరకు తాను మార్చి 1,3 తేదీల్లో ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలను కలసి చర్చిస్తానన్నారు. సమావేశంలో ప్రజాసేవ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.కె.మని, జిల్లా కార్యదర్శి వేలురెడ్డి, పిచ్చాటూరు మండల కార్యదర్శి పాల్తిరుమలై, అంబేడ్కర్ నేషనల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరణి తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడని టికెట్ అడిగితే అవమానిస్తున్నారు

● చనిపోతానంటూ వైసీపీ దళిత నేత డేవిడ్ వీడియో


పురుగుమందు సీసాతో డేవిడ్

కేవీబీపురం, ఫిబ్రవరి 28 : సత్యవేడు వైసీపీ టికెట్ ఆశించిన కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ మనస్తాపం చెందారు.టికెట్ అడిగినందుకు తనను అయినవారే ఎగతాళి చేస్తున్నారంటూ బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.సత్యవేడు టికెట్ ప్రతిసారీ బయటివారికి కేటాయించి స్థానికులను నిరాశపరుస్తున్నా రనేది డేవిడ్ వాదన. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని,ఎంపీ మిధున్ రెడ్డిని కలిసిన డేవిడ్ స్థానికుడిగా తనకు సత్యవేడులో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. విషయం తెలిసి స్థానికంగా కొంతమంది నాయకులు నీ స్థాయికి ఎమ్మెల్యే టికెట్ కావాలా అంటూ తనను అవహేళన చేస్తూ మాట్లాడుతుండడంతో మనస్తాపం చెంది తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయన ఇంటి వద్దకెళ్ళి పరిశీలించారు. అయినా డేవిడ్ ఆచూకీ దొరకలేదు.పోలీసులు ఫోను లోకేషన్‌ను ట్రేస్ చేయడానికి ప్రయత్నించగా అది స్విచ్‌ఆఫ్‌లో ఉంది.

లోకేశ్ సభకు స్థల పరిశీలన



ఏర్పేడు, ఫిబ్రవరి 28: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నారా లోకేశ్ చేపట్టే ఎన్నికల శంఖారావం సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఏర్పేడు మండలంలోని కృష్ణంపల్లి వద్ద అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నారావు, నాయకులు చెంచయ్యనాయుడు, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

పేదవాడికి అండ.. కాంగ్రెస్ అజెండా

● మాజీ ఎంపీ చింతామోహన్



కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో చింతామోహన్

సత్యవేడు, ఫిబ్రవరి 28: ప్రతి పేదవాడికి అండగా ఉండడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. బుధవారం సత్యవేడులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చింతామోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆకలి ఆంధ్రగా మారిందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తిపట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో బుధవారం కాంగ్రెసుపార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

రేణిగుంట: ప్రజాసంక్షేమాన్ని కాపాడేది కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే అని మాజీకేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ వెల్లడించారు. స్థానిక ఆర్టిసి బస్టాండ్ ప్రాంగణంలో ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. నాయకులు విఆర్ రావణన్,సి.మణితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఐటీలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

● పాల్గొన్న పలు పాఠశాలల విద్యార్థులు

ఏర్పేడు, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తిరుపతి ఐఐటీలో నిపుణులు,అధ్యాపకులు, సైన్స్‌పట్ల ఆసక్తి కలిగిన యువకులను ఓ చోట చేర్చి ఉత్సాహభరితంగా బుధవారం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రీయ అన్వేషణలో అద్భుతాలను నొక్కిచెప్పే అనేక ఆకర్షణీయమైన కార్యకలాపాలు,చర్చలు జరిపారు. న్యూఢిల్లీలోని జేఎన్‌యూ మాజీ వైస్ చాన్సలర్ శివనాడర్, ప్రొఫెసర్ రూపామంజరిఘోష్ విజ్ఞానంపై ప్రసంగించారు. వారు సెలబ్రేషన్ ఆఫ్ సైన్స్ విత్ క్వాంటం మిరాకిల్ అనే అంశం చుట్టూ కేంద్రీకృతమై ఉందంటూ పలు అంశాలపై మాట్లాడారు.

సైన్స్ ప్రయోగాలు, ప్రదర్శనలు

ఫిజిక్స్, కెమెస్ట్రీ విభాగాలు శాస్త్రీయ సూత్రాలను చర్యలో ఆకర్షణీయమైన ప్రయోగాలను నిర్వహించారు. రసాయన ప్రతిచర్యల నుంచి మనస్సును కదలించే భౌతిక విషయాల వరకువిద్యార్థులు, సందర్శకులు సైన్స్ మమాయాజాలాన్ని వీక్షించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు వందమంది పాఠశాల విద్యార్థులు ఐఐటీ క్యాంపస్‌లో ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరీ ప్రసన్న రాయ్, డాక్టర్ రితీష్ గంగ్వార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్‌కుమార్ , సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.




జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు - పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రాజమంజరి ఘోష్

హంద్రీ-నీవా కాలువ విషయంలో ముఖ్యమంత్రి జగన్ పరువు నిలపడానికి అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. సీఎం ప్రారంభించిన కుప్పం బ్రాంచి కాలువలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని, ఒకదానివెంట మరో చెరువు నిండినట్లు చెబుతున్నారు. ఈ మేరకు నిజ నిర్ధారణ పేరుతో అధికార యంత్రాంగం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిజంగానే అధికారులు చెబుతున్న నిజనిర్ధారణ నిజమేనా? కృష్ణమ్మ జలాలు పరుగులు పెట్టి చెరువులు చేరిపోతున్నాయా? కచ్చితంగా ఈ ప్రశ్నలకు లేదనే సమాధానమే చెప్పుకోవచ్చు. అధికారుల ప్రకటన, దానికి విరుద్ధంగా ఉన్న వాస్తవాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

- కుప్పం/రామకుప్పం

గేటుకు ఆవల పూర్తిగా తగ్గిపోయిన నీటి మట్టం



గుండిశెట్టిపల్లె వద్ద చుక్క నీళ్లు లేని హంద్రీ-నీవా కాలువ



● మసిపూసి మారేడుకాయ

కృష్ణమ్మా.. పరుగులు ఎక్కడమ్మా!

◆ ప్రవాహం తగ్గడంతో ప్రారంభమైన చోటే మద్దికుంటకు నీటి మళ్లింపు ◆ ఎండిన మిగిలిన కాలువ
◆ నిజ నిర్ధారణ అంటూ అధికారుల అబద్ధాలు

చిట్టచివరి ఆయకట్టు ఏది?

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా ప్రాజెక్ట్ చిట్టచివరి ఆయకట్టుదాకా నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తమ నిజనిర్ధారణ ప్రకటనలో పేర్కొన్నారు. రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద నియోజకవర్గంలో ప్రవేశించినప్పటినుంచి గమ్యస్థానమైన పరమసముద్రం చెరువు దాకా హంద్రీ-నీవా కాలువ పొడవు 139 కిలోమీటర్లు. చిట్టచివరి ఆయకట్టుకు నీళ్లు అందించడం అంటే, పరమసముద్రం నింపడం ద్వారా సమీపంలోని చేలకు సాగునీరు అందేలా చేయడం. కానీ, కాలువలో నీటి ప్రవాహం లేనందున దాదాపు ప్రారంభ ప్రదేశంలోనే అడ్డుగా కట్టకట్టి మద్దికుంటకు నీటిని మళ్లిస్తున్నారు. మరి చిట్టచివరి ఆయకట్టుకు నీరందించడం ఏమిటో అధికారులే చెప్పాలి. వారి లెక్కల ప్రకారం మద్దికుంట చెరువు కింద ఉన్న భూములే చిట్టచివరి ఆయకట్టు అయితే చెప్పేందుకేమీ లేదు.

హంద్రీ-నీవా కాలువ గమ్యస్థానమైన పరమసముద్రం చెరువు దుస్థితి



ఇదీ అధికారుల ప్రకటన

'హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను మద్దికుంట చెరువుకు, అక్కడినుంచి నాగసముద్రం, మణీంద్రం చెరువులకు మళ్లించడం జరుగుచున్నది. ఇప్పటికే మద్దికుంట నిండిపోయింది. శాంతిపురం మండలం వెంకటేశ్వరపురం గ్రామం వద్ద చిట్టివానికుంట చెరువును కూడా నింపడం జరిగింది. కృష్ణా నదిలో నీటి లభ్యత తక్కువ. శ్రీశైలం రిజర్వాయర్‌లో కనీస నీటి నిల్వలు ఉన్నప్పటికీ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సుమారు 676 కిలోమీటర్ల దూరం నీటిని తీసుకొచ్చి చిట్టచివరి ఆయకట్టుకు తరలించాము' అంటూ హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం (రెండవ దశ) అధికారి అనంత వెంకటరెడ్డి పేరుతో విడుదలైన ప్రకటన సారాంశమిదీ.

ఇవీ వాస్తవాలు



ముప్పావు వంతు నిండిన మద్దికుంట చెరువు



నీళ్లులేక బావురుమంటున్న నాగసముద్రం చెరువు



ఎండిపోతున్న మణీంద్రం చెరువు

రామకుప్పం మండలం రాజుపేట వద్ద సీఎం జగన్ ప్రారంభించేందుకు పెట్టిన గేటుకు ఎగువన హంద్రీ-నీవా కాలువలో నీటిమట్టం కేవలం ఒకటిన్నర, రెండు అడుగులు మాత్రమే ఉంది. కానీ, దానికి ఈవల మాత్రం కాలువ లోతు పెరగడం వల్ల నీటి మట్టం మూడున్నర అడుగుల మేరకు చేరింది. ఈ గేటునుంచి ఇవతలివైపు సుమారు కిలోమీటరు దూరంలో కట్ట కట్టేయడం వల్ల ఈ మాత్రపు నీటిమట్టమైనా సాధ్యమైంది. ఈ నిల్వ చేసిన ప్రాంతంనుంచి అధికారులు చెప్పినట్లు 70.100 కిలోమీటరు వద్ద గల కాలువ తూము ద్వారా సుమారు 50-60 అడుగుల దూరంలోని మద్దికుంట చెరువుకు నీళ్లు నెమ్మదిగా చేరుతున్నాయి. బుధవారం సాయంత్రానికి ముప్పావు వంతు చెరువు నిండిన మాట నిజమే. కృష్ణా జలాల విషయంలో వస్తున్న విమర్శలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎంతకష్టమైనా మద్దికుంట చెరువును నింపి, దాని దిగవగల నాగసముద్రం చెరువుకు నీళ్లు ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత మణీంద్రం చెరువుకు నీళ్లు వదలాలి. ఇవి ఎప్పుడు నిండతాయనేది అధికారులే చెప్పలేక పోతున్నారు. కాగా, మద్దికుంట చెరువుకు నీళ్లు మళ్లించడంతో గుండిశెట్టిపల్లె వైపు కాలువలో చుక్క నీళ్లు కనిపించడంలేదు.

గేటు తొలగించలేదు

● జల వనరులశాఖ వివరణ

కుప్పం: హంద్రీనీవా కాలువలో రాజుపేట వద్ద నీటి విడుదలకు అవసరమైన గేటును తొలగించలేదని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మీడియాలో వచ్చిన వార్తలకు బుధవారం వివరణ ఇస్తూ ప్రకటన విడుదల చేసింది. క్రాస్ రెగ్యులేటర్ వద్ద బటన్, వేదిక ఏర్పాట్లను మాత్రమే ముఖ్యమంత్రి పర్యటన అనంతరం తొలగించినట్లు పేర్కొంది అలాగే గేటుకు అటు ఇటు నీళ్లు నిలిచిపోలేదని ఇప్పటికీ కాలువ ద్వారా కింది ప్రాంతానికి ప్రవహిస్తున్నాయని పేర్కొంది గుండి శెట్టి పల్లె వద్ద కాలువ ఎండిపోలేదని స్థానిక నేతల కోరిక మేరకు కొంత భాగము 84వ కిలోమీటర్ వద్ద విడుదల చేశామని తెలిపింది. అలాగే శ్రీశైలం జలాశయం నుంచి మాల్యాల వద్ద గల ఎత్తిపోతల ద్వారా బుధవారం నాటికి కూడా 960 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని చెప్పింది. దాని ద్వారా 600 క్యూసెక్కుల నీరు జీడిపల్లి జలాశయానికి చేరుతున్నదని తెలిపింది. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువకు 8 చోట్ల ఎత్తిపోతల ద్వారా కుప్పం ఉపకాల్వకు నిరంతరాయంగా నీరు సరఫరా చేస్తున్నామని పేర్కొంది.



మద్దికుంట చెరువుకు నీటి మళ్లింపుతో ఇవతల ఎండిపోతున్న కాలువ

చిట్టివానికుంటను ఎట్ల నింపారో?

శాంతిపురం మండలం చిట్టివానికుంట నింపడం జరిగిందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్రకటనలో చెప్పిన ప్రకారం ఈ కుంటలాంటి చెరువు 75.750 కిలోమీటరు వద్ద ఉంది. దానికి ముందుగానే 70.100 కిలోమీటరు వద్ద కాలువ మధ్యలో నీటి ప్రవాహాన్ని ఆపి కట్ట కట్టేసి, మద్దికుంటకు నీళ్లు మళ్లిస్తున్నారు. ఆ తర్వాత కాలువలో చుక్క నీళ్లు లేవు. మరి లేని నీళ్లు అది కూడా ఐదారు కిలోమీటర్ల దూరం ప్రయాణించి చిట్టివానికుంటకు ఎలా చేరాయో అధికారులే చెప్పాలి.

కాకుంటే, సీఎం పర్యటన కోసం రోజుల తరబడి గేటువేసి నిలిపిన నీళ్లు.. ప్రారంభోత్సవం రోజైన 26వ తేదీన గుండిశెట్టిపల్లె దాకా ప్రవహించాయి. వీటిలో కొద్దిపాటి జలాన్ని ఆ పక్కనే గల చిట్టివానికుంటకు విడిచిపెట్టారు. దీన్నే కుంట మొత్తం నిండిపోవడంగా అధికారులు చెప్పుకొంటున్నారు.

కుప్పం బ్రాంచి కెనాల్ ఉద్దేశమిదీ

శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి కుప్పం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. నియోజకవర్గంలో కాలువ వెళ్లే 139 కిలోమీటర్ల పొడవునా 54 చెరువులకు నీరందిస్తూ పరమసముద్రం చెరువుకు నీళ్లు చేరితేనే ప్రాజెక్ట్ సఫలమైనట్లు. దాన్ని వంద శాతం పూర్తి చేసినట్లు. ఎన్నికల కోసం హడావుడిగా సీఎం జగన్ ప్రారంభించిన హంద్రీ-నీవా కాలువలో అడుగంటిన జలాలతో సమీపంలోని చిన్న కుంటలాంటి చెరువును నింపడానికే ఆపసోపాలు పడుతున్న వేళ, ప్రాజెక్టును ప్రారంభించేసినట్లు అధికార పార్టీ నేతలు చెప్పుకోవడం, కాదన్నవారిపై విమర్శలకు దిగడం చేస్తున్నారు.

నగరి సీటు కొత్త అభ్యర్థికి ఇవ్వండి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28: వైసీపీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త అభ్యర్థికి సీటు ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించకుంటామని వడమాలపేట వైసీపీ జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో రోజా గెలిచారని, ఇప్పుడు మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని ప్రజలు అనుకుంటున్నారని, వారి అభిప్రాయానికి అనుగుణంగా కొత్త అభ్యర్థికి సీటు ఇస్తే గెలిచే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. తాను ఆవిష్కరించిన శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ నేతలను ఇలా అణచివేతకు గురిచేయడం బాధాకరమన్నారు. నగరి నియోజకవర్గం పరిధిలో జరిగిన భూ ఆక్రమణలు అందరికీ తెలుసునని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసుదేవరెడ్డి, తులసీరామ్‌రెడ్డి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నానానికెళ్లి డిప్లొమా విద్యార్థి గల్లంతు



ధనుష్ (ఫైల్ ఫోటో)

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరికి విహార యాత్ర కోసం చంద్రగిరి నుంచి వెళ్లిన ఒక విద్యార్థి సముద్ర తీరంలో గల్లంతయ్యాడు.చంద్రగిరికి చెందిన డిప్లొమా విద్యార్థి ధనుష్ సహ విద్యార్థులతో కలిసి పుదుచ్చేరి యాత్రకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తందిరాయన్‌కుప్పం వద్ద సముద్ర స్నానం చేసేందుకు వెళ్లారు. రాక్షస అల రావడంతో ధనుష్ సముద్రపు నీటిలోకి కొట్టుకుపోయాడు.కోటకుప్పం పోలీసులు కేసు నమోదు చేసుకుని ధనుష్ కోసం గాలిస్తున్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ సముచితస్థానం

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 28: వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం లభిస్తోందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మంగళం పరిధిలోని రణధీరపురం(బీటీఆర్‌కాలనీ), సప్తగిరికాలనీ, మంగళం పంచాయతీలో ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించి ఆసరా చెక్కులను పంపిణీ చేశారు.మంగళం డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, రణధీరపురం, సప్తగిరికాలనీ, మంగళం పంచాయతీల వైసీపీ ఇన్‌ఛార్జులు లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణ, ఉప సర్పంచ్ ఉమాపతి, బైరెడ్డి రమేష్, నాయకులు శివ,శంకర్‌రాజు, రాంబాబు, రజాక్, సుధాయదవ్, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్ల పంపిణీ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 28: పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి కాయం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు దామినేటి నాగరాజు, వినయ్, జనసేన నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్లో సైన్స్ డే

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 28: విద్యా నగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ శేషాద్రి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఓసినోగ్రఫీ మంత్రిత్వ శాఖ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ పి. దివాకర్ పాల్గొని మాట్లాడారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

వైసీపీని వీడిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ

నాయుడుపేట/నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 28: సూళ్లూరుపేట నియోజకవర్గంలో అధికార పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. మైనార్టీ నేత, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ వైసీపీని వీడారు. పార్టీ సభ్యత్వానికి, పట్టణాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి నాయుడుపేటలో పార్టీ పటిష్టతకు రఫీ ఎంతో కృషి చేశారు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటినా... రఫీ కృషితో 5 వార్డుల్లో వైసీపీ గెలిచింది. అయితే రఫీకి 2019 నుంచి పార్టీలో అవమానాలు మొదలయ్యాయి. పలుమార్లు సీఎం జగన్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో పార్టీని వీడుతున్నట్లుగా బుధవారం ప్రకటించారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రఫీ నివాసానికి చేరుకొని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి సైతం ఫోన్‌చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు తాను ఎదుర్కొన్న అవమానాలు చాలని, ఇక తనను వదిలేయాలంటూ రఫీ తేల్చిచెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా టీటీడీ ఉద్యోగ నియామకాలు

● బీ.ఫార్మసీ ఉద్యోగాన్ని బీఏఎంఎస్ వారికి కేటాయించడం అన్యాయం
● ఏపీ ఫార్మాసిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుమన్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 28 : నిబంధనలు తుంగలో తొక్కి. అయిన వారికి అడ్డదారిలో ఉద్యోగాలు కట్టబెట్టేందుకు టీటీడీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఏపీ ఫార్మాసిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సింగనమల సుమన్ ఆరోపించారు. టీటీడీ పరిధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టడానికి జీవో 1060 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 1989లో ఒక గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. నియామకాలు చేపట్టాలన్నా, పదోన్నతులు ఇవ్వాలన్నా ఈ జీవోలోని నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఇటీవల టీటీడీ పరిధిలో నరసింగాపురంలో ఉన్న శ్రీ శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీ(ఆయుర్వేద మందుల తయారీ సంస్థ)లో పనిచేసేందుకు కాంట్రాక్టు ప్రాతిపాదికన ప్రొడక్షన్ సూపర్‌వైజర్ ఉద్యోగానికి దరకాస్తులు కోరుతూ ఈనెల 19న నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. జీవో ప్రకారం బీ.ఫార్మసీ అర్హత కలిగి రెండు సంవత్సరాలు ఆయుర్వేద మందుల తయారీలో అనుభవం కలిగిన వారు, 33 ఏళ్ల లోపు వయస్సు కల వారు అర్హులని వివరించారు. కానీ టీటీడీలోని ఓ ఉన్నతస్థాయి వ్యక్తి ఈ పోస్టును ఒక బీఏఎంఎస్ చదివిన వ్యక్తికి కట్టబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. ఈ పోస్టుకు బీఏఎంఎస్ అర్హతను కూడా నోటిఫికేషన్‌లో జతచేసి నియామక ప్రకటన విడుదల చేశారని పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.10 లక్షలకు పైగా బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయని తెలిపారు. ఈ పోస్టు నియామకానికి ఈనెల 27న తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో పరీక్ష కూడా నిర్వహించారన్నారు. అయితే బీ.ఫార్మసీ అర్హత కలిగిన వారిని కాకుండా బీఏఎంఎస్ వారిని మాత్రమే అనుమతించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అనర్హులకు కట్టబెట్టడం వంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై టీటీడీ పెద్దలు పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుచానూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● పులివర్తి నాని



హోటల్‌లో దోశ వేస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 28: తిరుచానూరు పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరుచానూరు పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం టీడీపీ సానుభూతిపరుల పింఛన్లు, రేషన్‌కార్డులను తొలగించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబం ప్రజాధనాన్ని కొల్లగొట్టి అందులో 10 శాతం తాయిలాలకు వెచ్చిస్తోందని ఆరోపించారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి వ్యవహారం మరింత దారుణంగా ఉందన్నారు.టీడీపీ అధికారంలోకి రాగానే అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో పులివర్తి నాని దోశ వేసి కార్యకర్తలకు అందించారు. పలువురు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్‌రాజ్, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, పాండి, సాయి రాయల్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.7.28 కోట్లతో పాకాల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

●అమృత్ భారత్ పథకంలో 13 స్టేషన్ల ఎంపిక

కలికిరి, ఫిబ్రవరి 28: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా రాయలసీమలో 13 రైల్వేస్టేషన్లు ఆధునికీకరణకు నోచుకోను న్నాయి.వీటిలో ఒకటైన పాకాల రైల్వేస్టేషన్‌ను రూ.7.28 కోట్లతో ఆధునికీకరించనున్నారు. గతేడాది ఫిబ్రవరిలో కేంద్రం అమృత్ భారత్ పథకాన్ని ఆచరణలోకి తెచ్చింది. వందే భారత్ రైళ్లకు ఉన్నత స్థాయి వర్గాల నుంచి మంచి ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఇక ద్వితీయ శ్రేణి వర్గాలకు కూడా అందుబాటులో ఆధునిక వసతులతో కూడిన రైళ్లను నడపాలని అమృత్ భారత్ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. సాధారణ ప్రయాణీకుల కోసం ఆధునిక వసతులతో రైళ్ల వేగాన్ని గరిష్టంగా పెంచడం, బోగీల్లో సాంకేతికత జోడించిన సదుపాయాలు, ప్రధానంగా అమృత్ భారత్ స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది కావలసిన వసతులను సమకూర్చడం అమృత్ భారత్ పథకం ప్రధాన ఉద్దేశాలు. వీటికి అనుగుణంగా బోగీల్లో భద్రతా ప్రమాణాలను పెంచనున్నారు.ఇక రైల్వేస్టేషన్లలో సౌకర్యవంతమైన వెయిటింగ్ హాళ్లు, అందుబాటులో వైఫై సదుపాయం, ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజీలు, తాగునీటి కియోస్కీలు, పరిశుభ్రమైన ఆధునిక మరుగుదొడ్లు తదితర వసతులను అమృత్ భారత్‌కు ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి చేయనున్నారు. ఇక అమృత్ భారత్ రైళ్లలో గరిష్టంగా 22 నాన్ ఏసీ కోచ్‌లుంటాయి. ఈ రైళ్లన్నింటినీ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగానే పరిగణిస్తారు. అవసరమైన రూట్లలో డిమాండును బట్టి ఏసీ కోచ్‌లను జత చేస్తారు. సాధారణ కోచ్‌లలో కూర్చుని ప్రయాణం చేయడమే కాకుండా త్రీ టయర్ పడకలు కూడా వుంటాయి. గరిష్టంగా గంటకు 130 కి.మీ. వేగంతో ఇవి నడుస్తాయి. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వందే భారత్ రైళ్లకు దీటుగా అమృత్ భారత్ రైళ్లు కూడా రాయలసీమలో పట్టాలెక్కనున్నాయి. అదే విధంగా ఈ రైళ్లకు అనువుగానే కొన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లను కూడా భారీ ఖర్చుతో ఆధునికీకరించనున్నారు.

రాయలసీమలో ఎంపికైన స్టేషన్లు

గతేడాది ఆగస్టులో రాష్ట్రానికి 18 అమృత్ రైల్వేస్టేషన్లు మంజూరు కాగా అందులో రాయలసీమకు రూ.42.60 కోట్లతో కేవలం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ఒక్కటే మంజూరైంది. తాజాగా రాష్ట్రానికి మొత్తం రూ.613.30 కోట్లతో 34 అమృత్ రైల్వే స్టేషన్లు మంజూరు కాగా అందులో రాయలసీమకు రూ.127.67 కోట్లతో 13 స్టేషన్లు దక్కాయి. డోన్, ఆదోని, మంత్రాలయం, కర్నూలు, అనంతపురం, కదిరి, మదనపల్లె రోడ్డు (సీటీఎం), పాకాల మార్గంలో తిరుపతికి ఒక రూటు, అదే విధంగా కర్నూలు, కడప, రాజంపేట మార్గంలో మరో రూటు అమృత్ రైళ్లు నడపడానికి మార్గం సుగమమైంది. ఆదోని రైల్వేస్టేషన్ ఆధునిక వసతులతో కూడిన పునర్వ్యవస్థీకరణకు (రూ.10.26 కోట్లు), అనంతపురం (రూ.9.29కోట్లు), చిత్తూరు (రూ.13.99 కోట్లు), ధర్మవరం (రూ.7.14 కోట్లు), డోన్ రూ.(8.64 కోట్లు), గుత్తి (రూ.10.81 కోట్లు), కడప (రూ.20.35 కోట్లు), సీటీఎం (రూ.8.01 కోట్లు), నంద్యాల (రూ.10.6 కోట్లు), మంత్రాలయం రూ.(3.58 కోట్లు), పాకాల (రూ.7.28 కోట్లు), రాజంపేట (రూ.5.93 కోట్లు), శ్రీకాళహస్తి (రూ.11.79 కోట్లు) స్టేషన్లు ఎంపికయ్యాయి.

రైతుల ఖాతాల్లో రూ.36.29కోట్లు : జేసీ



రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28 : రైతు భరోసా- పీఎం కిసాన్ కింద 1,80,763మంది రైతుల ఖాతాల్లో రూ.36.29కోట్లు, పంట రుణాలకు సున్నా వడ్డీ కింద రూ.3.93 కోట్లు జమ చేసినట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం ఇందుకు సంబంధించిన నమూనా చెక్కును ఆయన రైతులకు అందజేశారు.జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారిణి గీతారాణి, వ్యవసాయ సలహామండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ ప్రకటించిన ప్రాంతంలోనే 'ప్రత్యేక తరగతి సాధన సభ'

పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోదీ తిరుపతిలో ఎక్కడి నుంచి హామీ ఇచ్చారో అక్కడే తమ పార్టీ 'ప్రత్యేక తరగతి సాధన సభ' నిర్వహించబోతున్నట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు.బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చి 1వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో భారీ బహిరంగ సభను తిరుపతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సచిన్ పైలట్, రఘువీరారెడ్డి, శైలజానాథ్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌పార్టీ చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు.త్వరలో గుంటూరు, విశాఖపట్నం నగరాల్లో బహిరంగ సభలకు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారన్నారు.

యానాదయ్య వసూళ్లపై విచారణ చేపట్టాలి



రాధాదేవి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 28: టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య ఉద్యోగాల పేరుతో నాయీబ్రాహ్మణుల వద్ద డబ్బు వసూలు చేశారని, దీనిపై టీటీడీ విజిలెన్సు విచారణ చేపట్టాలని క్షురకుల మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవి డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిపై యానాదయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. క్షమాపణ చెప్పకుంటే యానాదయ్య ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న యానాదయ్య టీటీడీ కల్యాణకట్టలో శాశ్వత పోస్టులు ఇప్పిస్తానని డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా టీటీడీలో పనిచేసే క్షురకులకు రూ.20వేలు వేతనం, తొలగించిన 9మందిని విధుల్లోకి తీసుకోవాలనుకోవడం శుభపరిణామమన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యం



శ్రీఎన్ఆర్ఐ పాఠశాలలో సైన్స్ నమూనాల ప్రదర్శన

తిరుచానూరు, ఫిబ్రవరి 28: దేశ నిర్మాణానికి, ఆర్థిక పురోగతికి సైన్స్ చాలా అవసరమని శ్రీఎన్ఆర్ఐ పాఠశాల కరస్పాండెంట్ తేజస్వినిరెడ్డి, డైరెక్టర్ పృథ్వీరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరులోని శ్రీఎన్ఆర్ఐ పాఠశాలలో సైన్స్‌డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శన పలువురిని ఆకట్టుంది.హెచ్ఎం ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు రమ్య, సునీత, వసంతకుమార్, లక్ష్మీదేవి, గౌరీ, వీరాస్వామి, భవిత, వినోద్‌కుమార్, రాజేశ్వరి, చేతన, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ బీచ్ వద్ద నిర్మాణాలు ఆపించండి

▸▸ కలెక్టర్, తహశీల్దార్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ యంత్రాలను అక్కడికక్కడే తక్షణమే సీజ్ చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్, భీమునిపట్నం తహశీల్దార్‌ను ఆదేశించింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడానికి ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. సీఆర్‌జడ్ ప్రాంతంలో నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. భారీ యంత్రాలను వినియోగిస్తున్నారని.. సముద్రానికి అతిసమీపంలో నిర్మాణాలు చేస్తున్నారంటూ ఫొటో ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం.. సీఆర్‌జడ్ ప్రాంతంలో నిర్మాణాలకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించింది. నిర్మాణాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వీఎంఆర్‌డీఏ తరఫు న్యాయవాది తెలిపారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో డిశ్చార్జి పిటిషన్ల పరిష్కారానికి గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను పరిష్కరించడానికి ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రజాప్రతినిధులపై ఉన్న పెండింగ్ కేసులను పర్యవేక్షించే అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. సీబీఐ కోర్టులో ప్రజాప్రతినిధులకు సంబంధించి (జగన్ కేసులు) పెండింగ్‌లో ఉన్న 20 కేసుల్లో డిశ్చార్జి పిటిషన్‌లను రెండునెలల్లో పరిష్కరించాలని పేర్కొంటూ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 15న ఆదేశాలు జారీచేసింది. ఆ గడువు ఫిబ్రవరి 15తో ముగిసింది. అయితే మరింత గడువు కావాలని.. 13 వేల పేజీల స్టేట్‌మెంట్లు, ఆదేశాలు సిద్ధం చేయాల్సి ఉందని సీబీఐ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డిశ్చార్జి పిటిషన్‌లను పరిష్కరించడానికి ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించింది. జగన్‌పై ఉన్న 11 సీబీఐ, 9 ఈడీ కేసుల్లో జగన్, విజయసాయిరెడ్డి, ఇతర నిందితులవి కలిపి దాదాపు 129 డిశ్చార్జి పిటిషన్‌లు సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

బాబును కలిసిన పలువురు టీడీపీ నేతలు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును ఆ పార్టీ నాయకులు పలువురు బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. గుంటూరు ఎంపీ సీటు ఆశిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ చంద్రబాబుతో భేటీఅయ్యారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి గౌరు వెంకటరెడ్డి బాబును కలిశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీవీ నాయుడుకు సీటు ఇవ్వాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

టీడీపీలోకి సీమ విద్యార్థి సంఘాలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రాయలసీమ విద్యార్థి జేఏసీ నేతలు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు చెందిన వివిధ విద్యార్థి సంఘాల నేతలు బుధవారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీనివాసులు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ జాబ్ కేలండర్ పేరుతో వైసీపీ యువతను మోసం చేసిందని, ఈ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి యువత బుద్ధి చెప్తుందన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌లోపే కారుణ్య నియామకాలు

▸▸ బొప్పరాజు డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు చనిపోయి ఆరేడు సంవత్సరాలు దాటినందున వారి కుటుంబాల ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నోటిఫికేషన్ లోపు కారుణ్య నియామకాల ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కొవిడ్ ముందు, తర్వాత జిల్లా పరిషత్ టీచర్లు, హెడ్ మాస్టర్లు అనేక మంది చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని నిబంధనల మేరకు వీరందరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. ఒకవేళ సరిపోకపోతే అదనపు పోస్టులను క్రియేట్ చేసి అయినా ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

త్వరలో ఆర్టీసీలో పదోన్నతులకు పరిష్కారం: దామోదరరావు

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను త్వరితగతిన చేపట్టేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఈయూ రాష్ట్ర కమిటీ కృషి మేరకు సంస్థలో 2096 మందికి పదోన్నతులు వచ్చాయని తెలిపారు. తాజాగా బుధవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావును కలిసిన సందర్భంలో.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి ముందు చేరిన వారందరికీ వారి వారి విద్యార్హతల ప్రకారం పదోన్నతులివ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన గురువారం ఉదయం 11 గంటలకు కర్నూలులోని ఎస్టీబీసీ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. వైసీపీ పాలనలో విభిన్న ప్రతిభావంతులకు జరుగుతున్న అన్యాయం గురించి సమాజానికి తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

హైకోర్టులో కేఏ పాల్ వాదనలు

▸▸ విశాఖ ఉక్కుపై విచారణ 14కు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిలువరించాలని కోరారు. ప్లాంట్‌కు చెందిన వేల ఎకరాలను ఇప్పటికే విక్రయించేశారని, ఇక 16వేల ఎకరాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ప్లాంట్‌ను విక్రయించబోమని కేంద్రం చెబితే గనుక..తన బిలియనీర్ విదేశీ మిత్రులు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, విదేశీ సాయం నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్ఏ) కింద ప్రత్యేక ఖాతాకు కేంద్రం అనుమతిస్తే సొమ్మును అందులో జమ చేస్తామని వివరించారు. మొదటి విడతలోనే రూ.8వేల కోట్లు జమ చేస్తామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ భూములు విక్రయించకుండా స్టే విధించాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇదే వ్యవహారంపై దాఖలైన ఇతర వ్యాజ్యాలను ప్రస్తుత పిల్‌తో జత చేసే విషయంలో సీజే నుంచి పరిపాలనపరమైన ఆమోదం తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను మార్చి 14వ తేదీకి వాయిదా వేసింది.

అక్రమాల 'యోగా'సనం

▸▸ బుద్ధ యోగా ఫౌండేషన్ దందా

▸▸ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, వలంటీర్ల నియామకం

▸▸ మధ్యవర్తులతో లక్షల్లో ముడుపుల వసూళ్లు

▸▸ ఆయుష్ శాఖ పేరిట నియామక ఉత్తర్వులు

▸▸ పాఠశాల విద్యాశాఖ నుంచి ప్రొసీడింగ్స్

▸▸ తెరవెనుక అధికార పార్టీ వైసీపీ పెద్దలు!



బుద్ధ యోగా ఫౌండేషన్ పేరుతో ఇచ్చిన ఐడీ కార్డు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: రాష్ట్ర విద్యాశాఖలో రూ.కోట్ల కుంభకోణం జరిగినట్టు తెలుస్తోంది. యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్ల ఉద్యోగాల పేరిట ఒక్కో అభ్యర్థి నుంచి రూ.లక్షలు గుంజుకున్నారు. ఈ దందాను 2021లో మొదలు పెట్టారు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా పోస్టులు భర్తీ చేసి.. రూ.కోట్లు కొల్లగొట్టారని సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షలు, రూ.3.30 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా అందినకాడికి వందల మంది నుంచి వసూలు చేశారు. అనంతరం వీరిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్లుగా నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లకు రూ.25 వేలు, వలంటీర్లకు రూ.15 వేలు జీతం ఇస్తామని చెప్పడంతో నిరుద్యోగులు క్యూకట్టారు. అడిగినంత లంచాన్ని మధ్యవర్తులకు ముట్టజెప్పారు. ఇలా ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇచ్చారు. ఉద్యోగం వచ్చిందని ఆశగా స్కూళ్లలో చేరిన వారికి నెలల తరబడి జీతాలు లేవు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పలు ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కడప జిల్లాలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతలోనూ ఈ కేసులు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు ఈ స్కాం జరిగినట్లు తెలిసింది. ఈ స్కాం సహా బుద్ధ యోగా ఫౌండేషన్ వెనుక అధికార పార్టీ కీలక నేతలు ఉన్నారని సమాచారం.

విడతల వారీగా ఉద్యోగాలు

రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధా యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులకు వల వేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగాలు ఇస్తున్నామని నమ్మించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి అనుమతి ఉన్నట్లు నమ్మించారు. దీంతో అనంతపురం, కదిరి, పుట్టపర్తి, కడప ప్రాంతాలకు చెందిన వందల మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం తరలి వచ్చారు. చాలా మంది నిరుద్యోగులు 2022, 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో బ్రోకర్లకు లక్షల రూపాయలు చెల్లించారు. వీరికి 2023 జూన్, జూలైలో నియామక పత్రాలు ఇచ్చారు. కానీ, 2021 నుంచే విడతలవారీగా నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 13 విడతల్లో ఈ పోస్టులను భర్తీ చేశారని బాధిత టీచర్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 13వ బ్యాచ్‌లో 13 బ్యాచ్-ఏ, బ్యాచ్-బీ, బ్యాచ్-సీ, బ్యాడ్-డీ పేరుతో కూడా నియామకాలు చేపట్టి.. అందినకాడికి డబ్బులు లాగినట్లు సమాచారం. ఈ పోస్టులకు సంబంధించి 13వ బ్యాచ్ చివరిదని చెప్పి.. 13వ బ్యాచ్ కింద నాలుగు విడతల్లో నిరుద్యోగుల నుంచి డబ్బులు గుంజినట్టు తెలుస్తోంది. మొదట్లో ఉద్యోగాల్లో చేరిన వారికి 4 నెలలు, 6 నెలలు జీతాలు చెల్లించారు. ఆ తర్వాత పైసా కూడా ఇవ్వలేదు. 2023, జూన్ 26న నియమితులైన 12వ బ్యాచ్ వాళ్లకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సుమారు 300 మంది ఉద్యోగాల్లో చేరారు. కడప జిల్లాలో 74 మంది ఉన్నారని బాధితులు చెబుతున్నారు. కడపకు చెందిన ఓ మహిళ రూ.3 లక్షలకు పైగా చెల్లించారు. 2023, జనవరి 3వ వారంలో ఆమె మధ్యవర్తికి డబ్బు చెల్లించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మహిళ 2023, ఫిబ్రవరిలో రూ.2 లక్షలు చెల్లించారు. అదే ఏడాది జూన్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఏడు నెలలు గడిచినా జీతం చెల్లించలేదు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడు రూ.2 లక్షలు చెల్లించాడు. 2022 జులైలో అతనికి పోస్టింగ్ ఇచ్చారు. కానీ జీతం చెల్లించలేదు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1500 మంది వరకు బాధితులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా ఈ కుంభకోణం నడిచినట్లు తెలుస్తోంది.

బుద్ధ యోగా పేరిట..

ఉద్యోగాల భర్తీ అంతా బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నడిచినట్లు స్పష్టమవుతోంది. ఈ ఫౌండేషన్ వెనుక వైసీపీ పెద్ద తలకాయలే ఉన్నట్లు సమాచారం. పోలీసులు తీగ లాగితే ఈ కుంభకోణం డొంక కదులుతుందని బాధితులు చెబుతున్నారు. అయితే, అధికార పార్టీ పెద్దల హస్తం ఉందని తెలుస్తుండడంతో పోలీసులు చొరవ చూపడం అనుమానమేనని అంటున్నారు. బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట జరిగిన తతంగం మొత్తం ఓ మాయలా కనిపిస్తోంది. 2022 జూలైలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరిట ప్రొసీడింగ్స్ వచ్చాయి. యోగా ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లో చేర్చుకోవాలని, ప్రత్యేక హాజరు నమోదు చేయాలని సూచించారు. యోగా శిక్షణ ఉచితంగానే ఇస్తారని పేర్కొన్నారు. వీరి భర్తీ ప్రక్రియను మొత్తం బుద్ధ యోగా ఫౌండేషన్‌వారే చూసుకున్నారు. పోస్టుల భర్తీ వ్యవహారాన్ని బహిరంగపరచకుండా, లోలోపలే తతంగం నడిపించారు. గుంటూరులోని బ్రాడీపేటలో దీని కార్యాలయం ఉందని, 45 రోజుల శిక్షణ కోసం తమను అక్కడికి పిలిపించి, 60 రోజులు అక్కడే ఉంచారని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విడతలవారీగా లంచం చెల్లింపులు జరిగాయి. కొందరు ఫోన్ పే, మరికొందరు నగదు రూపంలో డబ్బులు చెల్లించామని చెబుతున్నారు. వీరందరికీ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట ఐడీ కార్డులు ఇచ్చారు. ఆయుష్ శాఖ కమిషనర్ పేరిట నిమాయక ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలావుంటే, జిల్లాల విద్యాశాఖ అధికారులకు వీరి నియామకంపై సమాచారమే లేదని తెలిసింది. కొందరు ఎంఈఓలకు మాత్రం మౌఖికంగా తెలుసునని సమాచారం.

కులశేఖరపట్నం స్పేస్ పోర్టు నుంచి ఇస్రో ఆర్‌హెచ్-200 సౌండింగ్ రాకెట్ ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్నం స్పేస్ పోర్టు నుంచి బుధవారం ఆర్‌హెచ్-200 రోహిణి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలతో, చిన్న ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో మరో స్పేస్ పోర్టును తమిళనాడులోని కులశేఖరపట్నంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్పేస్ పోర్టుకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 1.40 గంటలకు ఇస్రో శాస్త్రవేత్తలు ఆర్‌హెచ్-200 సౌండింగ్ రాకెట్‌ను చేపట్టారు. ఈ ప్రయోగం కోసం షార్ నుంచి శాస్త్రవేత్తలు, సీనియర్ ఇంజనీర్లు కులశేఖరపట్నం వెళ్లారు. స్పేస్ పోర్టు ఏర్పాటు చేసేటప్పుడు మొదట శాస్త్రవేత్తలు సౌండింగ్ రాకెట్ ప్రయోగాలు చేసి అక్కడ సముద్రపు వాతావరణం, వాతావరణంలో తేమ, గ్రావిటీ పవర్ అంశాలపై అధ్యయనం చేస్తారు. భవిష్యత్‌లో ఇస్రో భారీ ప్రయోగాలే లక్ష్యం పెట్టుకొంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఎల్వీ లాంటి చిన్న తరహా ప్రయోగాలు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన రాకెట్లను ప్రయోగించేందుకు కులశేఖరపట్నం స్పేస్‌పోర్టును ఇస్రో ఎంచుకొంది. ఐదేళ్ల క్రితమే తమిళనాడులోని తూర్పుతీరంలో రెండో స్పేస్ పోర్టుకోసం 2233 ఎకరాల భూముల్లో స్థలాన్ని ఎంపిక చేశారు.



నింగిలోకి వెళ్తున్న ఆర్‌హెచ్-200 సౌండింగ్ రాకెట్

టెట్, టీఆర్‌టీ షెడ్యూల్‌పై ముగిసిన వాదనలు

▸▸ తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్), ఏపీ టీచర్ నియామక పరీక్ష (ఏపీ టీఆర్‌టీ)ల మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ బుధవారం ఆదేశాలిచ్చారు. టెట్, టీఆర్‌టీ మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం. పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దుచేసి ఈ పరీక్షల నిర్వహణకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. టెట్ ముగిసిన తర్వాత టీఆర్‌టీ రాయడానికి సిద్ధమయ్యేందుకు తగిన సమయం లేదని, అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని విన్నవించారు. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగిన సమయం ఇచ్చేలా షెడ్యూల్‌లో మార్పులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వాట్సాప్ సమాచారంతో పిల్ ఎలా వేస్తారు?

▸▸ పిటిషనర్‌ను నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

▸▸ బార్ కౌన్సిల్ నిధుల దుర్వినియోగంపై పిల్ కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. వాట్సాప్ వచ్చిన సమాచారం ఆధారంగా పిల్ ఎలా దాఖలు చేస్తారని పిటిషనర్‌ను నిలదీసింది. పిల్‌ను నాన్‌సీరియస్‌గా అభివర్ణించింది. పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది బాల్‌రెడ్డికి రూ.50 వేలు ఖర్చులు విధిస్తూ పిల్‌ను కొట్టివేసింది. ఈ దశలో పిటిషనర్ జోక్యం చేసుకుంటూ దిగువ కోర్టులో న్యాయవాది అయిన తాను అంత మొత్తం చెల్లించుకోలేనని, విధించిన ఖర్చులను ఉపసంహరించాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విధించిన ఖర్చులను తొలగించింది. బార్ కౌన్సిల్ స్టాంపుల కొనుగోలులో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ కడపకు చెందిన న్యాయవాది మూలి వెంకట బాలిరెడ్డి పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకురాగా పార్టీఇన్‌పర్సన్ బాలిరెడ్డి వాదనలు వినిపిస్తూ... స్టాంపులు విక్రయించగా వచ్చిన సొమ్ముకు, బార్ కౌన్సిల్ చూపిస్తున్న మొత్తానికి వ్యత్యాసం ఉందన్నారు. ఈ దశలో కలగజేసుకున్న ధర్మాసనం... "స్టాంపుల విక్రయం ఎలా జరుగుతుంది? ఎవరు విక్రయిస్తారో"ని ఆరాతీసింది. బార్ కౌన్సిల్ తరఫున సీనియర్ న్యాయవాది పి. వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ ఆరోపణలో నిజం లేదని, రూ.100 స్టాంపు విక్రయించగా వచ్చిన సొమ్ములో రూ.86 మాత్రమే బార్ కౌన్సిల్‌కు చేరుతుందని వివరించారు. పిటిషనర్ రూ.100 బార్ కౌన్సిల్‌కు చేరుతుందని తప్పుగా లెక్కవేసి, నిధులు దుర్వినియోగం అయ్యాయనే అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా పిల్ ఎలా దాఖలు చేశారని పిటిషనర్‌ను ధర్మాసనం నిలదీసింది.

గండం గట్టెక్కినట్లే!

▸▸ హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారుకు ఉపశమనం



కాంగ్రెస్ పరిశీలకులతో సీఎం సుఖ్వీందర్ సింగ్

సిమ్లా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటేయడంతో సుఖ్వీందర్‌సింగ్ సర్కారు మైనారిటీలో పడిందని బీజేపీ వాదించింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. బుధవారం ఉదయం ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ గవర్నర్‌ను కలిశారు. 2024-25 ఆర్థిక బిల్లును ఓటింగ్ ద్వారానే ఆమోదించేలా చూడాలని కోరారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 40, బీజేపీకి 25 సీట్లు ఉన్నాయి. మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు చెరో 34 ఓట్లు వచ్చాయి. డ్రా తీయగా విజయం మహాజన్‌ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు, స్వతంత్రులు ముగ్గురు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు మైనారిటీలో పడిపోయిందని బీజేపీ చెబుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం అసెంబ్లీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ సభ్యులు ఆర్థిక బిల్లును అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. స్పీకర్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తర్వాత జైరాం ఠాకూర్ సహా 15 మంది బీజేపీ సభ్యులను సస్పెండ్ చేశారు. అంతకు ముందే 10 మంది సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం మూజువాణీ ఓటుతో బడ్జెట్‌ను ఆమోదించి, సభను నిరవధికంగా వాయిదా చేశారు. ఇదిలా ఉండగా.. సీఎం సుఖ్వీందర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజాపనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు.

రంగంలోకి కాంగ్రెస్ అధిష్ఠానం

హిమాచల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదంలో పడడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీనియర్ పరిశీలకులు భూపేశ్ బఘేల్, భూపిందర్‌సింగ్ హుడా, డీకే శివకుమార్‌లను హుటాహుటిన సిమ్లా పంపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే వారిని ఆదేశించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. బీజేపీ దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారును పడగొట్టే చాన్స్ కేంద్రానికి ఇవ్వబోమన్నారు.

హిమాచల్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పును అణచివేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక ఆరోపించారు. అధికార దుర్వినియోగం, కేంద్ర సంస్థలను ఉసిగొల్పడం ద్వారా బీజేపీ రాజకీయ అనిశ్చితి సృష్టించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. కాగా, హిమాచల్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను అధిష్ఠానం రంగంలోకి దించింది.

దూరం నుంచే గుండె లయ వినొచ్చు!

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏసియా 2024 సదస్సు మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా నిర్వహించిన ట్రేడ్ ఎక్స్‌పోలో పలు స్టార్టప్‌లు ప్రదర్శించిన ఉత్పత్తులు, నూతన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అమీర్‌పేటలో ఉన్న పేషెంట్ గుండెలయను ఎక్కడో అమెరికాలో ఉన్న డాక్టర్ వినే వీలు కల్పించే స్టెతస్కోప్‌ను 'ఆబో' అనే సంస్థ తయారుచేసింది. దాని పేరు.. 'ఆబో వన్'. ఇది పేషెంట్ల గుండెలయను రికార్డ్ చేసి ఫార్వార్డ్ చేయగలదని.. రియల్‌టైమ్‌లోనూ వినిపించగలదని ఆబో ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ స్మార్ట్ స్టెత్ ధర.. 16500 రూపాయలు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనారోగ్యాలతో బాధపడే పేషెంట్ల సమస్యను డాక్టర్ ఎక్కడి నుంచైనా పర్యవేక్షించడానికి వీలు కల్పించే 'ఆబోస్కోప్'ను సైతం ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. అలాగే. 'ఆబో ఎక్స్6' అనే పరికరంతో ఆరు రకాల వైటల్స్‌ను, ఆబో రింగ్‌తో నిద్ర, ఒత్తిడిని ట్రాక్ చేయడం సాధ్యమవుతుంది. ఏ తరహా సమస్యకు ఏ తరహా థెరపీ అయితే సరిపోతుందో తెలిపే 'ఫిజీ' అనే డివైజ్‌ను స్టార్టాన్ ల్యాబ్స్ తయారుచేసింది.



స్టెతస్కోప్

రాధ, రాజారెడ్డి దంపతులకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు రాధా రెడ్డి-రాజారెడ్డి దంపతులలకు ప్రతిష్ఠాత్మకమైన సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించింది. కొన్ని దశాబ్దాలుగా ఢిల్లీలో కూచిపూడి నృత్య కళను పరిరక్షిస్తూ వేల మందికి శిక్షణ నిచ్చిన రాధా రాజారెడ్డి దంపతులకు గతంలోనే పద్మశ్రీ, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లో భాగంగా వారికి రూ 3 లక్షల మేరకు నగదు పురస్కారం లభిస్తుంది. 2022, 23 సంవత్సరాలకు సంగీత నాటక అకాడమీ సంగీతం, నృత్యం, రంగస్థలం, సంప్రదాయ, జానపద, గిరిజన సంగీత, నృత్య కళల్లో 92 మందికి అవార్డులు ప్రకటించింది. మరో 80 మంది యువకళాకరులకు కూడా 2022, 23 సంవత్సరాలకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలను ప్రకటించింది. 2023 సంవత్సరానికి గాను సంగీత నాటక అకాడమీ పురస్కారాలు లభించిన వారిలో తెలుగువారు ప్రముఖ గాయకుడు, భగవద్గీతను గానం చేసిన ఎల్వీ గంగాధర శాస్త్రి, మద్దాలి ఉషా గాయత్రి (కూచిపూడి), నటరాజ రామకృష్ణ శిష్యుడు పేరిణి ప్రకాశ్ (పేరిణి నాట్యం) ఉన్నారు 2022 సంవత్సరానికి గాను మండా సుధారాణి (గాత్రం), వినుకొండ సుబ్రహ్మణ్యం (డోలు వాయిద్యం), భాగవతుల సేతురామ్ (కూచిపూడి)లకు సంగీత నాటక పురస్కారాలు లభించాయి. ఈ పురస్కారం కింద తామపత్రం, రూ.లక్ష నగదు ఇస్తారు. 2023 సంవత్సరానికి గాను ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు అందుకున్నవారిలో తెలుగువారు బి మల్లికార్జున రావు (రంగస్థల కళ- మేకప్), అంగడి భాస్కర్ (జానపద సంగీతం) ఉండగా, 2022 సంవత్సరానికి ప్రముఖ సినీ నటుడు ఎస్వీ రంగారావు ని నాగభూషణం మనుమరాలు శ్వేత ప్రసాద్ (గాత్రం), టీరెడ్డి (కూచిపూడి) ఉన్నారు. యువపురస్కారాలు కింద తామపత్రం, రూ.25వేల నగదు ఇస్తారు. కాగా కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావుకు జగద్గురుపూర్ మహేంద్ర కర్ణ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది.

ఎస్వీ వర్సిటీ గుండా రోడ్ల నిర్మాణంపై స్టే!

▸▸ నిర్మాణానికి వీసీ అభ్యంతరం లేదనడంపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుమల వెళ్లే వీఐపీలు సాఫీగా ప్రయాణించేందుకు వీలుగా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ గుండా రహదారి నిర్మాణం చేపట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రహదారి నిర్మాణం చేస్తే అభ్యంతరం లేదని యూనివర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ) చెప్పడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా వీసీ నిర్ణయాలు ఉండాలని అభిప్రాయపడింది. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్‌లకు వీసీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. రహదారి నిర్మాణం జరిగితే యూనివర్సిటీ గుండా ప్రతిరోజూ లక్షలాది వాహనాలు ప్రయాణిస్తాయని, ఇది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది. యూనివర్సిటీ క్యాంపస్ గుండా రహదారి నిర్మాణాన్ని ఆమోదించలేమని పేర్కొంది. రహదారి నిర్మాణం విషయంలో ఎలాంటి తదుపరి చర్యలూ చేపట్టవద్దని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతికి చెందిన ఆర్.అభిషేక్‌రెడ్డి హైకోర్టులో ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది టి.అనిరుధ్ యాదవ్ వాదనలు వినిపించారు.

'ఎన్నికల్లో బ్రీత్ ఎనలైజర్ల'పై ముగిసిన వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో మద్యానికి ప్రభావితం కానివారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొనేలా పోలింగ్ బూత్‌ల వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. విజయవాడకు చెందిన జనవాహిని పార్టీ కార్యదర్శి ఎం.శివరామ సుందర్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తర ఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16ని అనుసరించి మద్యం సేవించినవారిని ఓటుహక్కు వినియోగించకుండా నిరోధించాలన్నారు. మద్యం సేవించినవారికి దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అర్హత ఉండదని పేర్కొన్నారు. తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంటూ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

ఎమ్మెల్యే మల్లాదికి ఊరట

▸▸ కల్తీ మద్యం కేసును కొట్టేసిన ప్రజాప్రతినిధుల కోర్టు

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కల్తీ మద్యం కేసులో వైసీపీ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును ప్రజాప్రతినిధుల కోర్టు నిర్దోషిగా తేల్చింది. 2015 డిసెంబరు 7న కృష్ణలంక రణదివె నగర్ స్వెహరానగర్‌కు చెందిన రోజువారీ కూలీలు జాతీయ రహదారికి పక్కన ఉన్న స్వర్ణ బార్‌లో మద్యం తాగారు. వారిలో ఆకుల విజయ్‌కుమార్, నరస గోపి, మీసాల మహేష్, మునగాల శంకరరావు, ఎన్‌బీబీవీ నాంచారయ్య ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది ఆస్పత్రిపాలయ్యారు. బార్ యజమాని కె.నాగేశ్వరరావుతోపాటు 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లాది విష్ణు ఏ-9, ఆయన సోదరుడు శ్రీనివాస్ ఏ-10గా ఉన్నారు. నిందితుల్లో ఇద్దరు చనిపోయారు. మిగిలిన 13 మందిపై ఉన్న కేసును కోర్టు కొట్టేస్తూ న్యాయాధికారి గాయత్రీదేవి బుధవారం తీర్పు ఇచ్చారు.

రెండోసారి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలు అందజేయండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు తీసుకొని తాజాగా మరోసారి ఇళ్ల పట్టాలు పొందినవారి వివరాలను తమ ముందు ఉంచాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఆదేశాలిచ్చింది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 22,620 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు వీలుగా రూ.210 కోట్లు జారీ చేస్తూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త సింగరాజు రాంబాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.రవిప్రసాద్ వాదనలు వినిపించారు. ఒంగోలు మున్సిపాలిటీ పరిధిలో 7వేల టిడ్కో ఇళ్లతో పాటు పలు ఖాళీ స్థలాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు వాటిని లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. కేవలం రాజకీయ కారణాలతో మరో 22 వేల ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీకి ముందు సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించలేదన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందినవారికే మరోసారి ఇస్తున్నారన్నారు.